# సూర్య

జాతీయ తెలుగు దినపత్రిక

తెలుగు

CIRCLEATED IN KURNOOL HYDERABAD AMARAVATHI, TIRUPATI, SPSR NELLORE PRAKASHAM, YSR KADAPA, PRAKASAM,ANANTAPUR ,VIJAYAWADAGUNTUR ,VISAKHAPATNAM,EASTGODAVARI, | ఎడిటర్ : యస్.మహేశ్వరరెడ్డి | గురువారం 11 జూన్, 2026 | సంపుటి : 05 / సంచిక : 128/ పేజీలు : 12 / వెల : రూ.5/-





రెండు వారాల్లో కీలక ప్రకటన: ట్రంప్



'తల్లికి వందనం' నిధుల విడుదలకు లైన్ క్లియర్..!







## పారిశుధ్య పనులపై...
# నిర్లక్ష్యం..!!

### అధికారులపై మంత్రి నాదెండ్ల ఫైర్

- పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు...
- మున్సిపల్ అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం
- పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోం..
- పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలి
- బడి పిల్లలకు నాణ్యమైన భోజనం : మంత్రి నాదెండ్ల మనోహార్

పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులను.. మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. తెనాలిలో మంత్రి బుధ వారం ఆకస్మిక తనిఖీలు చేశారు

## సామాన్యులపై మరో..
# గుది బండ..!!

### భారీగా పెరిగిన కూరగాయల ధరలు.. టమాటా, మిర్చి పైపైకి..



తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు పెరిగాయి. కొద్ది నెలల క్రితం కిలో టమాట రూ.15కే లభించగా.. ఇప్పుడు ఏకంగా రూ.50కి చేరుకుంది. ఇక మిగతా కూరగాయల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. పెరిగిన ధరలతో సామాన్యులకు ఖర్చు పెరుగుతోంది. రోజువారీ కూలీ చేసుకుని జీవనం కొనసాగించేవారికి పెరిగిన ధరలు షాక్ ఇస్తున్నాయి.



## తగ్గిన బంగారం, వెండి
# ధరలు..!!

**ముంబయి:** దేశీయంగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.4300 క్షీణించి రూ.1.56 లక్షలకు (అన్ని పన్నులూ కలిపి) చేరింది. కిలో వెండి సైతం దాదాపు రూ.10వేలు తగ్గి రూ.2.45 లక్షలకు (అన్ని పన్నులూ కలిపి) పలుకుతోంది. క్రూడాయిల్ రేట్లు పెరగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం వల్ల డిమాండ్ తగ్గుముఖం పట్టడం కారణంగా ఈ లోహాల ధరలు క్షీణించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర రోజు వ్యవధిలో 90 డాలర్లు క్షీణించి 4168 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 2.24 శాతం క్షీణించి 63.87 డాలర్ల వద్ద కొనసాగుతోంది. అమెరికా- ఇరాన్ మధ్య మరోసారి ఘర్షణలు ప్రారంభం కావడంతో క్రూడాయిల్ ధర మరోసారి 90 డాలర్ల ఎగువకు చేరింది. దీనికితోడు అమెరికా డాలర్ బలోపేతం కావడంతో బంగారం ధరలు దిగి వచ్చాయని పీఎల్ వెల్త్ ప్రోడక్ట్ అండ్ ఫ్యామిలీ ఆఫీస్ ఇఎడ్ రాజ్‌కుమార్ సుబ్రమణియన్ పేర్కొన్నారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు, దీర్ఘకాలం అధిక వడ్డీ రేట్లు కొనసాగే అవకాశం ఉండడంతో వీటికి డిమాండ్ తగ్గి ధరలు తగ్గుముఖం పట్టడానికి ప్రధాన కారణమని చెప్పారు. అమెరికా బాండ్లపై రాబడులు పెరగడం, ద్రవ్యోల్బణ భయాలూ కారణమని లెమన్ మార్కెట్స్ డెస్క్ రీసెర్చ్ అనలిస్ట్ గౌరవ్ గార్గ్ పేర్కొన్నారు.

## సుపరిపాలనే...
# అతి పెద్ద పరీక్ష..!!

### 12 ఏళ్ల పాలనపై మోదీ ఆసక్తికర పోస్టు

### ప్రధాని మోదీ చరిత్ర సృష్టించారు

**అవిశ్రాంతంగా పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందగలడని రాసుకొచ్చిన మోదీ..**

- కొందరు నాయకులు దేశాన్ని పాలిస్తారు
- చాలా కొద్దిమంది మాత్రమే దేశ గతిని మార్చేస్తారు
- వారిలో ఒకరే ప్రధాని నరేంద్ర మోదీ
- కరుణ, ఆశయం రెండూ కలిసి
- సాగగలవని ఆయన నిరూపించారు
- వికసిత్ భారత్ సాకారం కోసం కట్టుబడి ఉన్నాం
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- మాతృభూమిపై గౌరవం, కర్మభూమి సంక్షేమం కోసమే..
- 4,399 రోజులుగా దేశానికి నిస్వార్థంగా సేవ చేస్తున్నారు
- 12 ఏళ్ల క్రితం భారత్ నిర్ణయాత్మక నాయకత్వాన్ని ఎంచుకొంది
- ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి నిరంతరం
- మద్దతిస్తున్న మోదీకి నా కృతజ్ఞతలు : పవన్ కల్యాణ్
- దేశాన్ని సుదీర్ఘకాలం పరిపాలించిన ప్రధాని మోదీకి అభినందనలు
- దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను అధిగమించి..
- ఈ అసమానమైన రికార్డును సృష్టించడం నిజంగా అద్భుతం
- ఏపీ మంత్రి నారా లోకేశ్

ప్రధాని నరేంద్ర మోదీ చరిత్ర సృష్టించారు. భారత్‌లో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన నేతగా ఆయన నిలిచారు. ఈసందర్భంగా తన 12 ఏళ్ల పాలనపై మోదీ ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టారు. 'ప్రజాసేవ అనేది సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష. వినయం, అంకితభావం, కర్తవ్య దీక్షతో అవిశ్రాంతంగా పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందగలడు' అని మోదీ రాసుకొచ్చారు. ఇక, ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అనేకమంది ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్ వేదికగా పోస్టులు పెడుతున్నారు. 'కొందరు నాయకులు దేశాన్ని పాలిస్తారు. చాలా కొద్ది మంది మాత్రమే దేశ గతిని మార్చేస్తారు. వారిలో ఒకరే ప్రధాని మోదీ. ఒక సామాన్యుడి ఇంటిలోని నీటి కుళాయి నుంచి చంద్రయాన్‌తో చంద్రుడిని చేరేవరకు.. పొలంలోని రైతు ఆకాంక్షల నుంచి సరిహద్దుల్లోని సైనికుడి ధైర్యం వరకు మోదీ నాయకత్వం దేశ విశ్వాసాన్ని, సామర్థ్యాలను బలోపేతం చేస్తూనే ఉంది. ప్రగతి ఫలాలు ప్రతి భారతీయుడికి చేరేలా చూసింది. ఆయన పాలనలో సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యతను పాటించారు. బలహీనులకు మద్దతిస్తూనే.. అవకాశాలను విస్తరించి భారత ఆర్థిక పునాదులను బలోపేతం చేసే సంస్కరణలను మేళవించారు. కరుణ, ఆశయం రెండూ కలిసి సాగగలవని ఆయన నిరూపించారు. ఈ అద్భుతమైన మైలురాయిని సాధించిన ప్రధాని మోదీకి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నా. స్వర్ణాంధ్రను నిర్మించడానికి.. వికసిత్ భారత్ సాకారం అయ్యేందుకు కట్టుబడి ఉన్నాం' – ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు







"మాతృభూమిపై గౌరవం, కర్మభూమి సంక్షేమం కోసమే తన జీవితం అంకితం అన్న స్ఫూర్తితోనే ప్రధాని నరేంద్ర మోదీ 4,399 రోజులుగా దేశానికి నిస్వార్థంగా సేవ చేస్తున్నారు. 12 ఏళ్ల క్రితం భారత్ నిర్ణయాత్మక నాయకత్వాన్ని ఎంచుకొంది. నేడు భారత్ గతంలో కంటే బలంగా, సురక్షితంగా, మరింత ఆత్మవిశ్వాసంతో నిలబడింది. ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి నిరంతరం మద్దతిస్తున్న మోదీకి నా కృతజ్ఞతలు. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించే దిశగా మనం కృషి చేస్తున్నాం. వికసిత్ భారత్ సాకారంలో ఆంధ్రప్రదేశ్ బలమైన భాగస్వామిగా ఉన్నందుకు గర్వంగా ఉంది" – ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



'దేశాన్ని సుదీర్ఘకాలం పరిపాలించిన నాయకుడిగా నిలిచిన ప్రధాని మోదీకి నా హృదయపూర్వక అభినందనలు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను అధిగమించి.. ఈ అసమానమైన రికార్డును సృష్టించడం నిజంగా అద్భుతం. మోదీ నాయకత్వం ప్రపంచ వేదికపై భారత్‌ను అజేయశక్తిగా నిలబెట్టింది. అవకాశాలు, ప్రజల గౌరవం, స్వావలంబన, సాధికారత వైపు దేశాన్ని నడిపించింది'
– ఏపీ మంత్రి నారా లోకేశ్

# కశ్మీర్‌లో.. "కల్లోలం"..!!

జమ్ముకశ్మీర్‌లో ఏకకాలంలో భిన్న వాస్తవాలు ప్రతిబింబిస్తున్నాయి. ఎల్‌ఓసీకి అవతలి ప్రాంతం నిరసనలు, ఉద్రిక్తతలతో అట్టుడుకుతుండగా.. ఇవతలి ప్రాంతంలో మాత్రం జోజిలా టన్నెల్ పూర్తికావడంతో సందడి వాతావరణం నెలకొంది.

- పీఓకేలో ఉద్రిక్తత.. కశ్మీర్‌లో జోజిలా సంబరాలు
- జమ్ముకశ్మీర్‌లో ఏకకాలంలో భిన్న వాస్తవాలు ప్రతిబింబిస్తున్నాయి
- ఎల్‌ఓసీకి అవతలి ప్రాంతం నిరసనలు, ఉద్రిక్తతలు
- ఆందోళనలను అణిచివేసేందుకు పాకిస్థాన్ అధికారులు కఠిన చర్యలు
- గిల్గిట్-బాల్టిస్థాన్ ప్రాంతాల్లోనూ అసంతృప్తి స్వరాలు వినిపిస్తున్నాయి
- సుమారు 13.15 కిలోమీటర్ల పొడవుతో నిర్మితమైన ఈ టన్నెల్..
- ఆసియాలోనే అత్యంత పొడవైన ద్విముఖ రహదారి సొరంగాల్లో ఒకటి




కశ్మీర్ ప్రాంతాల్లో లైన్ ఆఫ్ కంట్రోల్(ఎల్‌ఓసీ)కి ఇరువైపులా ఒకే సమయంలో చోటుచేసుకున్న పరిణామాలు భిన్న వాస్తవాలను ప్రతిబింబిస్తున్నాయి. ఓవైపు పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో నిరసనలు, ఉద్రిక్తతలు, భద్రతా బలగాల కాల్పులతో పరిస్థితి ఆందోళనకరంగా మారగా.. మరోవైపు జమ్ముకశ్మీర్‌లో జోజిలా సొరంగం నిర్మాణంలో కీలక మైలురాయి సాధించడంతో అభివృద్ధి సంబరాలు కనిపిస్తున్నాయి.

**పీఓకేలో ఉద్రిక్తతలు..** రావలకోట్, ముజఫరాబాద్, మీర్‌పూర్ తదితర ప్రాంతాల్లో ఇటీవల నిరసనలు ఉద్ధృతమయ్యాయి. విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర సరకుల ధరలు, ద్రవ్యోల్బణం, పరిపాలనా వ్యవస్థపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ(జేఏఏసీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలను అణిచివేసేందుకు పాకిస్థాన్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. దీంతో పలుచోట్ల ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం సహా వందలాది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల జరిగిన ఘర్షణల్లో 30 మందికి పైగా మృతిచెందినట్టు, సుమారు 200 మందికిపైగా గాయపడినట్టు తెలుస్తోంది. దీంతో గిల్గిట్–బాల్టిస్థాన్ ప్రాంతాల్లోనూ అసంతృప్తి స్వరాలు వినిపిస్తున్నాయి.

**జోజిలా సంబరాలు..** ఇక.. జమ్ముకశ్మీర్‌లోని సోనమార్గ్, బాల్తాల్,

..2వ పేజీలో

## అమరావతిపై కేంద్ర కేబినెట్
# వరాల జల్లు..!!

- సుమారు రూ.2,500 కీలకమైన రెండు పెద్ద ప్రాజెక్టులకు ఆమోదం
- అమరావతిలో 5.35 ఎకరాల్లో రూ.1,299 కోట్ల వ్యయంతో
- కేంద్ర ప్రభుత్వ ఆఫీస్ కాంప్లెక్స్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

ఏపీ రాజధాని అమరావతిపై కేంద్ర కేబినెట్ వరాల జల్లు కురిపించింది. సుమారు రూ.2500 కోట్ల వ్యయంతో నిర్మించే రెండు భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై కేంద్ర కేబినెట్ వరాల జల్లు కురిపించింది. నేడు ఢిల్లీలో సమావేశమైన కేంద్ర మంత్రి మండలి.. సుమారు రూ.2,500 కీలకమైన రెండు పెద్ద ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. వీటిలో ఒకటి కేంద్ర ప్రభుత్వ కార్యాలయ కాంప్లెక్స్ నిర్మాణం కాగా.. మరొకటి కేంద్ర ఉద్యోగుల గృహ

..2వ పేజీలో

సూర్య
గురువారం 11 జూన్, 2026

# పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం..!!

**అధికారులపై మంత్రి నాదెండ్ల ఫైర్**

**పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు...**

**మున్సిపల్ అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం...పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోం..**

**పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలి....బడి పిల్లలకు నాణ్యమైన భోజనం : మంత్రి నాదెండ్ల మనోహర్**

**పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులను.. మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. తెనాలిలో మంత్రి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు**

**గుంటూరు జిల్లా:** పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. తెనాలిలో ఈరోజు(బుధవారం) మంత్రి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ క్రమంలో మున్సిపల్ అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తూర్పు కాల్వకట్ట రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయిన విషయాన్ని ఇటీవల స్థానికులు.. మంత్రి దృష్టికి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. వెంటనే చెత్తను తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌తో పాటు సంబంధిత సిబ్బందికి అప్పటికప్పుడు మంత్రి నాదెండ్ల ఆదేశాలు జారీ చేశారు.

**పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోం..** అయితే ఈరోజు అదే ప్రాంతాన్ని మంత్రి నాదెండ్ల పరిశీలించారు. చెత్త కుప్పలు అలాగే ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనాస్థలికి అధికారులను పిలిపించి ఎందుకు వ్యర్థాలు తొలగించలేదని ప్రశ్నించారు. దీనికి మున్సిపల్ సిబ్బంది



టెండర్ ప్రక్రియ ద్వారా చెత్తను తొలగిస్తామని చెప్పడంతో మంత్రి అసహనం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీకి చెందిన జేసీబీలు, ట్రాక్టర్లతో చేయాల్సిన పనికి టెండర్ ఎందుకు? అంటూ అధికారులను నిలదీశారు. ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోమని హెచ్చరించారు. అధికారులు పనిచేయడం ఇష్టం లేకపోతే సెలవు పెట్టి వెళ్లాలని కూడా మంత్రి ఘాటుగా వ్యాఖ్యానించారు.

**పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలి..** చెత్త పూర్తిగా తొలగించే వరకు అక్కడి నుంచి కదలబోనని స్పష్టం చేసిన మంత్రి కాల్వగట్టుపై ఉన్న బల్లపై కూర్చొన్నారు. మంత్రి అక్కడే ఉండటంతో మున్సిపల్ యంత్రాంగం వెంటనే అప్రమత్తమై జేసీబీలు, ట్రాక్టర్లతో చెత్త తొలగింపు పనులను వేగవంతం చేసింది. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాల్వల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులు నాణ్యతతో చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు.

**బడి పిల్లలకు నాణ్యమైన భోజనం..** విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతకు పెద్దపీట వేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం కోసం 2.25 లక్షల క్వింటాళ్ల సూపర్ ఫైన్ బియ్యం సేకరిస్తున్నామని వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సంబంధిత అధికారులను మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు.

# కశ్మీర్‌లో..“కల్లోలం”..!!

**(మొదటిపేజి తరువాయి)** మినామార్గ్ ప్రాంతాల్లో జోజిలా సొరంగ నిర్మాణం కీలక దశను చేరుకుంది. కశ్మీర్, లద్దాఖ్ వైపుల నుంచి తవ్విన మార్గాలు కలవడంతో ఇంజినీర్లు, కార్మికులు విజయోత్సాహం నిర్వహించారు. సుమారు 13.15 కిలోమీటర్ల పొడవుతో నిర్మితమైన ఈ టన్నెల్.. ఆసియాలోనే అత్యంత పొడవైన ద్విముఖ రహదారి సొరంగాల్లో ఒకటి. సముద్రమట్టానికి సుమారు 11,578 అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా ఏడాది పొడవునా కశ్మీర్‌-లద్దాఖ్ మధ్య అనుసంధానానికి సాధ్యం కానుంది. ప్రస్తుతం.. శీతాకాలంలో భారీ మంచు కారణంగా జోజిలా కొన్ని నెలలపాటు మూతపడుతుంది. కానీ టన్నెల్ అందుబాటులోకి రావడంతో లద్దాఖ్‌కు నిత్యం రాకపోకలు సాగించేందుకు వీలుంటుంది. 2019లో ఆర్టికల్ 370 రద్దు చేసినప్పటి నుంచి.. కశ్మీర్‌లో రహదారులు, సొరంగాలు, రైల్వేలు, విద్యుత్ ప్రాజెక్టులు, పర్యాటక మౌలిక సదుపాయాలపై పెట్టుబడిలా భారీగా పెరిగాయి. జెడ్-మోర్హ్ సొరంగం, చెనాబ్ రైల్వే వంతెన, ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే మార్గం, జోజిలా సొరంగం వంటి ప్రాజెక్టులు ప్రాంతీయ అనుసంధానానికి బలం చేకూరుస్తున్నాయి. వందే భారత్ రైళ్లు కశ్మీర్ లోయలో పరుగులు తీయడం, పర్యాటక రంగం విస్తరించడం, కొత్త పెట్టుబడులు రావడం స్థానిక ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిస్తున్నాయి. పీఓకేలో ఆర్థిక సమస్యలు, రాజకీయ అసంతృప్తి, పరిపాలనా వివాదాలు తరచూ ఆందోళనలకు దారితీస్తుండగా.. కశ్మీర్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెట్టుబడులు, పర్యాటక రంగం విస్తరణ ప్రధాన చర్చాంశాలుగా నిలుస్తున్నాయి. జూన్ 9న చోటుచేసుకున్న ఈ రెండు సంఘటనలు ఎల్‌ఓసీకి ఇరువైపులా కశ్మీర్ ప్రాంతాల్లో నెలకొన్న భిన్న పరిస్థితులను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి.

## అమరావతిపై కేంద్ర కేబినెట్

# వరాల జల్లు..!!

**(మొదటిపేజి తరువాయి)** సముదాయ నిర్మాణం. అమరావతిలో 5.35 ఎకరాల్లో రూ.1,299 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వ ఆఫీస్ కాంప్లెక్స్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్




ఆమోదించింది. స్మార్ట్ సిటీ రూపకల్పనలో భాగంగా ఆధునిక సౌకర్యాలతో నిర్మించే ఈ కాంప్లెక్స్ ద్వారా రాష్ట్రంలో కేంద్ర నిధులు, కార్యాలయాల సమన్వయం మరింత సులభతరం కానుందని అధికారులు తెలిపారు. అదే విధంగా.. మరో 17 ఎకరాల్లో రూ.1,235 కోట్ల వ్యయంతో కేంద్ర ఉద్యోగుల కోసం గృహ సముదాయం నిర్మించేందుకూ ఆమోదముద్ర వేసింది. ఈ గృహాల ద్వారా ఉద్యోగులు సౌకర్యవంతమైన నివాసం పొందడం సహా నూతన కొలువులకు మరింత స్ఫూర్తినిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

## దూసుకొస్తున్న ఈదురుగాలులు..

# ఇక వానలే వానలు..

**ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు..**

**గత నాలుగు రోజుల నుంచి వానలు పడుతున్నాయి. ఇక రెండు రోజుల క్రితం అయితే భారీగా వర్షాలు పడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు తేలిక పాటి నుంచి భారీ వర్షాలు పడనున్నాయి. మరి, వాతావరణ శాఖ అధికారులు ఎలాంటి హెచ్చరికలు జారీ చేసారో ఇక్కడ చూద్దాం..**



గత నాలుగు రోజుల నుంచి వానలు పడుతున్నాయి. ఇక రెండు రోజుల క్రితం అయితే భారీగా వర్షాలు పడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు తేలిక పాటి నుంచి భారీ వర్షాలు పడనున్నాయి. మరి, వాతావరణ శాఖ అధికారులు ఎలాంటి హెచ్చరికలు జారీ చేసారో ఇక్కడ చూద్దాం..

నైరుతి రుతుపవనాలు రాబోయే మూడు, నాలుగు రోజుల్లో మధ్య అరేబియా సముద్రంలోని మరికొన్ని భాగాలు, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులోని మిగిలిన భాగాలు , నైరుతి బంగాళాఖాతం, పశ్చిమ-మధ్య, వాయవ్య బంగాళాఖాతంలోని మరికొన్ని భాగాలు, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, బీహార్, జార్ఖండ్, ఒడిశాలోని కొన్ని ప్రాంతాల్లోకి మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. నిన్న ఉత్తర కర్ణాటక అంతర్గత ప్రాంతాలు, దాని పరిసరాలలో ఉన్న ఉపరితల ఆవర్తనం, మధ్య బంగాళాఖాతం నుండి తీరప్రాంత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంతర్గత కర్ణాటక మీదుగా తీరప్రాంత కర్ణాటక వరకు సగటు సముద్ర మట్టానికి 3.1, 5.8 కిలోమీటర్ల మధ్య విస్తరించి ఉన్న ద్రోణితో విలీనమైంది. తూర్పు ఉత్తరప్రదేశ్‌పై ఉన్న ఉపరితల ఆవర్తనం నుండి ఛత్తీస్‌గఢ్, తూర్పు మధ్యప్రదేశ్ మీదుగా విదర్భ వరకు ఒక ద్రోణి సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడి ఉంది. రాగల 3 రోజుల పాటు వాతావరణంలో భారీ మార్పులు రానున్నాయి . ఈరోజు,రేపు , ఎల్లుండి రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు రానున్న మూడు రోజులలో పెద్దగా మార్పు లేదు. ఈరోజు రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. ఈరోజు , రేపు ఎల్లుండి రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులు మరియు 40 నుండి 50 కి.మీ వేగం కలిగిన ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

# ‘తల్లికి వందనం’ నిధుల విడుదలకు లైన్ క్లియర్..!

**అకౌంట్లో పడేది అప్పుడే.. ముహూర్తం ఫిక్స్..**

**ఏపీలోని విద్యార్థులకు కూటమి ప్రభుత్వం శుభవార్త అందించింది. తల్లికి వందనం నిధుల విడుదలపై క్లారిటీ ఇచ్చింది. రూ.13 వేలు అకౌంట్లలో ఎప్పుడు పడతాయనే దానిపై స్పష్టత వచ్చింది. ప్రస్తుతం లబ్దిదారలు ఎంపిక వేగంగా జరుగుతోంది. త్వరలోనే అర్హుల జాబితాను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.**

ఏపీలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భారీ గుడ్ న్యూస్. కూటమి సర్కార్ ‘తల్లికి వందనం’ పథకాన్ని విద్యార్థుల చదువుల కోసం అమలు చేస్తోన్న విషయం తెలిసిందే. విద్యార్థుల చదువులు తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తోంది. ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుకుంటున్న విద్యార్థులకు ప్రతీ ఏడాది రూ.15 వేలు అందిస్తోంది. ఈ ఆర్థిక సాయాన్ని తల్లిదండ్రుల బ్యాంక్ అకౌంట్లలో జమ చేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో చదువుకుంటున్న విద్యార్థులందరికీ ఈ పథకం వర్తింపచేస్తోంది. విద్యాసంవత్సరం ప్రారంభం లోనే వీటిని అందిస్తోంది. దీంతో విద్యార్థుల ఫీజులు, పుస్తకాలు కోసం వీటిని తల్లిదండ్రులు ఉపయోగించుకోవచ్చు.

**అకౌంట్లోకి ఎప్పుడంటే..?...** ఈ నెల 12వ తేదీ నుంచి ఏపీలో పాఠశాలలు ప్రారంభం అవుతున్నాయి. వేసవి సెలవుల అనంతరం తిరిగి తెరుచుకుంటున్నాయి. దీంతో జులైలో తల్లికి వందనం నిధులు విడుదల చేయాలని



ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో దీనికి నిధుల విడుదలకు ఆమోదం తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే రిలీజ్ చేసేందుకు ఆమోదముద్ర వేశారు. దీంతో జులై మొదటి వారంలోనే వీటిని జమ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత ఏడాది స్కూల్స్ ప్రారంభమైన తర్వాత జూన్‌లోనే నిధులు విడుదల చేశారు. అయితే ఈ సారి కొన్ని సాంకేతిక సమస్యల వల్ల వచ్చే నెలలో రిలీజ్ చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. గత ఏడాది 67.27 లక్షల మందికి పథకం అమలు చేయగా.. ఈ సారి లబ్దిదారుల సంఖ్య పెరగనుంది. సుమారు 68 లక్షల మంది ఈ సారి లబ్దిదారులుగా ఉండే అవకాశముంది.

**ప్రతీఒక్కరికి రూ.15 వేలు...** ఈ పథకం కింద ప్రతీ విద్యార్థి తరపున తల్లిదండ్రుల అకౌంట్లలో రూ.15 వేలు అందిస్తుండగా.. వీటిల్లో పాఠశాలల నిర్వహణ కోసం రూ.2 వేలు కట్ చేస్తున్నారు. మిగతా రూ.13 వేల సొమ్మును ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే ఈ నిధులు అకౌంట్లో పడాలంటే ఖచ్చితంగా విద్యార్థి తల్లి బ్యాంక్ అకౌంట్ ఆధార్‌తో లింక్ అయి ఉండాలి. అలాగే బ్యాంక్ అకౌంట్‌కు ఎన్‌పీసీఐ లింక్ జరిగి ఉండాలి. ఒకవేళ లింక్ జరక్కపోతే బ్యాంక్‌కు వెళ్లి చేసుకోవాలి. త్వరలోనే అర్హుల జాబితాను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించనున్నారు. ప్రస్తుతం లబ్దిదారుల జాబితా తయారుచేస్తుండగా.. పారదర్శకంగా రూపొందాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెలలో లబ్దిదారుల జాబితా సిద్ధం కానుండగా.. వచ్చే నెలలో బ్యాంక్ అకౌంట్లలో జమ చేయనున్నారు. దీంతో ఈ నగదు కోసం లబ్దిదారులు ఎదురుచూస్తున్నారు.

# సంపాదకీయం

## రెండు వారాల్లో కీలక ప్రకటన: ట్రంప్

అమెరికా అధ్యక్షుడ్ని డొనాల్డ్ ట్రంప్ మరోసారి రెచ్చిపోయారు.అమెరికా హెలికాప్టర్ అపాచీపై దాడి చేసింది ఇరాన్ అని ఆరోపించారు. ఈ ఘటనపై ఎట్టిపరిస్థితుల్లో ప్రతీకారం తీర్చుకొని తీరుతామని ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. అయితే ఈ ఘటనపై ఇరాన్ ఇంకా స్పందించలేదు. ప్రస్తుతం పశ్చిమాసియా యుద్ధం మరోసారి తీవ్ర స్థాయికి చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.




బుధవారం బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ డ్రోన్, క్షిపణి దాడులు చేసింది. అమెరికా స్థావరాలపై మొత్తం 21పైగా దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాలు, నిఘా రాడార్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా గతంలో జరిపిందని దానికి ప్రతిచర్యగా ఈ అటాక్ చేసినట్లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. అయితే డొనాల్ట్ ట్రంప్ సైతం ఈ దాడులపై గుర్రుగా ఉన్నారు. హర్మూజ్ జలసంధి సమీపంలో అమెరికాకు చెందిన అపాచీ హెలికాప్టర్‌ను కూల్చివేసింది. ఇరాన్ అని దానికి ఎట్టిపరిస్థితుల్లో ప్రతీకారం తీర్చుకొని తీరుతామన్నారు. యుద్ధంలో అమెరికా తన అధిపత్యాన్ని కొనసాగిస్తోందని మరో రెండు వారాల్లో ఇరాన్‌పై సంపూర్ణ విజయం ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఆ ప్రకటనతో చమురు ధరలు సైతం దిగొస్తాయని ప్రకటించారు.అయితే ఈ వ్యాఖ్యలపై ఇరాన్ సైతం ఘాటుగానే బదులిచ్చింది. ఎలాంటి దాడి జరిగినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ప్రతిదాడి తీవ్రంగా జరుగుతుందని హెచ్చరించింది. మరోవైపు ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజిమిన్ నెతన్యాహు సైతం ఇరాన్‌పై దాడులు చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. “అమెరికా మద్దతు లేకుండానే ఇరాన్‌ను ఎదుర్కోవాల్సిన పరిస్థితి రావొచ్చు. ఆయుధాల కొరత, అంతర్జాతీయ ఒత్తిడి, దౌత్యపరమైన ఒంటరితనం వంటి మూల్యాలు చెల్లించాల్సి వచ్చినా.. ఆ పరిస్థితికి సిద్ధంగా ఉండాలి” అని ఆయన కేబినెట్ వర్గాన్ని ఉద్దేశించి మాట్లాడినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియా యుద్ధం మరోసారి తీవ్రస్థాయికి చేరుకునే అవకాశం ఉంది.

## సామాన్యులపై మరో గుది బండ..!!

**భారీగా పెరిగిన కూరగాయల ధరలు.. టమాటా, మిర్చి పైపైకి..**

**తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు పెరిగాయి. కొద్ది నెలల క్రితం కిలో టమాట రూ.15కే లభించగా.. ఇప్పుడు ఏకంగా రూ.50కి చేరుకుంది. ఇక మిగతా కూరగాయల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. పెరిగిన ధరలతో సామాన్యులకు ఖర్చు పెరుగుతోంది. రోజువారీ కూలీ చేసుకుని జీవనం కొనసాగించేవారికి పెరిగిన ధరలు షాక్ ఇస్తున్నాయి.**

సామాన్యులకు బిగ్ షాక్ తగిలింది. తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. వర్షాల వల్ల ఉత్పత్తి తగ్గిపోవడంతో సరఫరా తగ్గింది. దీని వల్ల కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. దీంతో సామాన్యులు నిత్యావసర సరుకులకు ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తోంది. పెట్రోల్, డీజిల్ ధరలు ఇటీవల లీటర్‌పై రూ.7.50 మేర పెరిగాయి. దీంతో రవాణా ఖర్చులు పెరగడం కూడా కూరగాయల ధరలపై ప్రభావం



చూపుతోంది. ఇంధన ధరలు పెరిగినప్పుడు సాధారణంగా నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతూ ఉంటాయి. ఒకవైపు పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరగ్గా.. కూరగాయల ధరలు కూడా పెరగడంతో సామాన్యులపై భారం పడుతోంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.

**హైదరాబాద్‌లో..** హైదరాబాద్‌లోని రైతు మార్కెట్లలో కిలో టమాటా రూ.43, వంట రూ.23, బెండకాయ రూ.40, పచ్చిమిర్చి రూ.40, క్యాలీఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.19, క్యారెట్ రూ.42, దొండకాయ రూ.50, ఆలు రూ.17, ఉల్లిపాయ రూ.22, సొరకాయ రూ.13, పొట్లకాయ రూ.13, బీన్స్ రూ.75, గోరుచిక్కుడు రూ.35, చిక్కుడుకాయ రూ.45, దోస రూ.18, బీరకాయ రూ.40, కాకర రూ.45, చామగడ్డ రూ.28, కీర రూ.35, క్యాప్సికం రూ.70, బీట్ రూట్ రూ.25, కందగడ్డ రూ.28, చిలకడదుంప రూ.18, మామిడ రూ.23, మునగ రూ.40 పలుకుతున్నాయి.

**విజయవాడలో రేట్లు ఇలా..** ఇక విజయవాడలోని రైతు మార్కెట్లలో కేజీ టమాట రూ.49, వంగ రూ.35, బెండ రూ.38, పచ్చిమిర్చి రూ.34, కాకర రూ.48, క్యాబేజీ రూ.30, క్యారెట్ రూ.40, దొండకాయ రూ.40, బంగాళదుంప రూ.23, ఉల్లిపాయలు రూ.23, గోరుచిక్కుడు రూ.38, దోస రూ.20, సొర రూ.20, చిక్కుళ్లు రూ.90, చామదుంప పరూ.28, కంద రూ.38, బీట్ రూట్ రూ.30, కీరదోస రూ.42, బీన్స్ రూ.90, క్యాప్సికం రూ.85, అలసందలు రూ.36, చిలకడదుంప రూ.30కు లభిస్తున్నాయి.

**గుంటూరులో ఇలా..** ఇక గుంటూరులోని ఎన్టీఆర్ రైతు బజార్‌లో కిలో టమాట రూ.43, వంగ రూ.40, బెండకాయ రూ.39, పచ్చిమిర్చి రూ.30, కాకర రూ.48, క్యారెట్ రూ.45, క్యాబేజీ రూ.33, బీరకాయ రూ.45, దొండకాయ రూ.24, బంగాళదుంప రూ.22, ఉల్లిపాయ రూ.22, గోరుచిక్కుళ్లు రూ.36, దోస రూ.18, పొట్లకాయ రూ.40, చామ రూ.27, గోంగూరు రూ.8, తోటకూర రూ.15, చుక్కకూర రూ.15, మెంతికూర రూ.5, కొత్తిమీర రూ.25, బీట్ రూట్ రూ.31, కీర రూ.39, క్యాప్సికం రూ.74, అల్లం రూ.140, ఫ్రెంచి బీన్స్ రూ.95, సొర రూ.10, అరటి రూ.8గా ఉన్నాయి.

## స్టీల్‌ప్లాంట్ అనే పదం పలికేందుకు కూడా జగన్‌కు అర్హత లేదు: మంత్రి అనిత

**అమరావతి:** స్టీల్‌ప్లాంట్ అనే పదం పలికేందుకు కూడా జగన్‌కు అర్హత లేదని ఏపీ హోంమంత్రి అనిత అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో గాయపడిన కార్మికులను వైకాపా అధ్యక్షుడు జగన్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. జగన్ ఆస్పత్రికి వచ్చినా ఆయన పార్టీ కార్యకర్తలు ఏవేవో నినాదాలు చేశారని విమర్శించారు. “సీఎం హోదాలో జగన్ ఎప్పుడైనా స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లారా? అక్కడి



కార్మికుల సమస్యల గురించి మాట్లాడారా? మృతుల కుటుంబాలకు స్టీల్‌ప్లాంట్, కేంద్రం, రాష్ట్రం పరిహారం ఇచ్చాయి. మృతుల కుటుంబాలకు రూ.కోటి కంటే ఎక్కువ పరిహారం అందుతుంది. చనిపోయిన ఒప్పంద కార్మికుల కుటుంబానికి కూడా పరిహారం, ఉద్యోగం ఇస్తున్నాం. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు రాజకీయంగా విమర్శలు సరికాదు”అని మంత్రి అనిత అన్నారు.

### కిరాణా షాపులు, బేకరీలపై తూనికలు-కొలతల శాఖ

# మెరుపు దాడులు

**పామిడి జూన్ 10 సూర్య న్యూస్:** పట్టణంలో కిరాణా షాపులు, బేకరీలపై తూనికలు-- కొలతల శాఖ అధికారులు బుధవారం మెరుపు దాడులు నిర్వహించారు. తూనికలు-- కొలతల అధికారి వై.జీ. శంకర్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో పలు అక్రమాలు వెలుగు చూశాయి. గణపతి కిరాణా షాప్‌లో సిగరెట్ ప్యాకెట్లపై ముద్రించిన ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించిన అధికారులు యాజమాన్యానికి రూ.40 వేల జరిమానా విధించారు. మరికొన్ని కిరాణా దుకాణాల్లోనూ నిబంధనల ఉల్లంఘనలు గుర్తించి అపరాధ రుసుములు విధించారు.అదే విధంగా పోలీస్ కాంప్లెక్స్‌లోని బెంగళూరు బేకరీలో తక్కువ తూకాలతో వినియోగదారులను మోసం చేస్తున్నట్లు గుర్తించారు. అధికారులు తనిఖీలు చేపట్టడంతో కొందరు వ్యాపారులు తమ దుకాణాలను మూసివేసి వెళ్లిపోయినట్లు సమాచారం.ఈ సందర్భంగా అధికారి వై.జీ. శంకర్ మాట్లాడుతూ వినియోగదారులను మోసం చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే కిరాణా షాపులు, బేకరీల లైసెన్సులు సైతం రద్దు చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రూక్సానా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



### దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో

# యోగా కార్యక్రమం

**ఆలయ కార్యనిర్వహణాధికారి సుభాష్, ఛైర్మన్ పీవీ.రమణ**

**వేంపల్లె జూన్ 10 సూర్య న్యూస్ :** దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక పట్టణంలోని శ్రీ లక్ష్మీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. దేవాదాయ-ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సుభాష్, ఛైర్మన్ పీవీ రమణలు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం యోగా మాస్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో భక్తులు యోగాసనాలు చేశారు. అనంతరం ధ్యానం చేయించి, ధ్యానం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. నిత్యం యోగాసనాలు, ధ్యానం చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు హరిప్రవీణ్, సహాయ అర్చకులు తిరుమల వేణుస్వామి, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన

# సింగారం సర్పంచ్

**మహబూబాబాద్ జూన్ 10 సూర్య న్యూస్:** బయ్యారం మండలం సింగారం గ్రామపంచాయతీలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు సింగారం పంచాయతీలో అనారోగ్యంతో చికిత్స చేయించుకున్న గుగులోత్ విజయ 32 వేలు, గుగులోత్ బిచ్చ 13500, సపవత్ చందన 32 వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ చేతులమీదుగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చుంచు మమతా,వార్డు సభ్యులు చెరుకుపల్లి మనీషా, బాధవత్ లల్యా నాయక్, గుగులోత్ భద్రు నాయక్,సపవత్ అనిత,మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి సీతారాములు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకుపల్లి రవి,గుగులోత్ అమర్ సింగ్, గ్రామ నాయకులు గుగులోత్ శ్రీను నాయక్,గుగులోత్ మహేష్ నాయక్,మంగీలాల్ నాయక్, బిచ్చ,కిష్ట,కస్నా,తదితరులు నాయకులు పాల్గొన్నారు.



### సైకిల్ యాత్ర: 52వేల కి.మీ తిరిగి...

# మంత్రాలయంకు చేరుకున్న విశాఖ కుర్రాడు

**మంత్రాలయం జూన్ 10 సూర్య న్యూస్ :** విశాఖకు చెందిన రాము 3 ఏళ్ల 7 నెలలుగా 'చెట్లు నరకొద్దు, నీళ్లు వృధా చేయొద్దు' అంటూ సైకిల్‌పై భారతదేశ యాత్ర చేస్తూ బుధవారం మంత్రాలయం రాఘవేంద్రస్వామిని దర్శించుకు న్నారు ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ 52వేల కి.మీ ప్రయాణించి 12 జ్యోతిర్లింగాలు, 18 శక్తి పీఠాలు, అలాగే ప్రధాన ఆలయాలు దర్శించుకున్నాని తెలిపారు. అలాగే వందలాది మొక్కలు నాటినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ చెట్టు నాటి, నీటిని వృధా చేయకుండా పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.



# నేడే ఉచిత కంటి వైద్యశిభిరం

**చౌడేపల్లి జూన్ 10 సూర్య న్యూస్ :** జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారి సయుక్త ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి వారు గురువారం ఉదయం 8 గంటల నుండి మద్యాహ్నం 1 గంట వరకు వైద్యశిభిరం జరుగునని నిర్వాహకులు తెలియజేశారు. వైద్య శిభిరమునకు వచ్చువారు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ,ఫోన్ నెంబర్ తో రావలయును. దగ్గర చూపు, దూరపు చూపు, కంటిలో శుక్లము కొరకు ఆపరేషన్ ఉచితముగా చేయబడనని ఆస్తమా, మధుమేహం, గుండె సమస్యలు, రక్తపోటు, క్యాన్సర్, మూర్ఛవ్యాధి, మూత్రపిండముల వ్యాధి ఉన్నవారు ఇప్పటికే వాడుతున్న మందుల చీటి ఖచ్చితంగా తీసుకొని రావలెను.కంటి అద్దములు అవసరమైతే అతితక్కువ ధరకే శిభిరం వద్ద లభించునని నిర్వాహకులు తెలియజేశారు.చౌడేపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు ఈ వైద్యశిభిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలియజేశారు.

# ఏఐ ఆధారిత స్ర్కీనింగ్‌తో చిన్నారుల సమగ్ర అభివృద్ధికి బాట

**రాయవరం జూన్ 10 సూర్య న్యూస్:** మండలం లోని పసలపూడి గ్రామంలో మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 0-6 సంవత్సరాల చిన్నారుల కోసం ఏఐ ఆధారిత స్ర్కీనింగ్ కార్యక్రమాన్ని రాయవరం మండలం పసలపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో యు. పూర్ణిమ,అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి. అనిరుద్ , ఐసిడిఎస్ సూపెర్వైజర్స్ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీపీవో యు. పూర్ణిమ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య, మానసిక మరియు సామాజిక అభివృద్ధిని ప్రారంభ దశలోనే పర్యవేక్షించడం ద్వారా వారి భవిష్యత్తును మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవచేతన యాప్‌లో ఏఐ సాంకేతికతను వినియోగించడం ద్వారా చిన్నారుల అభివృద్ధి స్థితిని మరింత సమర్థవంతంగా అంచనా వేయగలుగుతున్నామని పేర్కొన్నారు.వైద్యాధికారి డాక్టర్ బి. అనిరుద్ మాట్లాడుతూ ఏఐ ఆధారిత స్ర్కీనింగ్ ద్వారా జన్యుపరమైన లోపాలు, పోషకాహార లోపాలు, వ్యాధులు, ఎదుగుదల ఆలస్యం మరియు వైకల్యాలు వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య సేవలు అందించవచ్చని 4 ని'ం గురించి మరియు డి ఈ ఐ సి గురించి వివరించారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యమని తెలియజేశారు.కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికత ఆరోగ్య రంగంలో నూతన మార్పులకు దారితీస్తోందని, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం ఆధునిక సేవలను చేరువ చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకంగా మారుతున్నాయని తెలిపారు.అనంతరం అధికారులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్స్ ఇంటింటికీ వెళ్లి నవచేతన యాప్‌లోని ప్రశ్నావళి ద్వారా చిన్నారుల అభివృద్ధి స్థితిపై సమాచారం సేకరిస్తారని తెలిపారు. ఏఐ ఆధారిత విశ్లేషణ ద్వారా చిన్నారుల్లో అభివృద్ధి ఆలస్యాలను ముందుగానే గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవచ్చని తెలియజేశారు.





# నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు

**జగ్గయ్యపేట జూన్10 సూర్య న్యూస్:** పట్టణంలోని కోదాడ రోడ్డులో ఉన్న మార్కెట్ యార్డ్‌లో నటకిరీటి, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను యువ నాయకులు శ్రీరాం ధనుంజయ (చినబాబు) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా కేక్ కట్ చేసి బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అక్కడికి విచ్చేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కేక్ పంపిణీ చేశారు. ప్రత్యేకంగా భోజనాలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొని బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.



# వృద్దుడిపై చెయ్యి చేసుకున్న కండక్టర్..!

**పిర్యాదుచేసినా పట్టించుకోని డిపోమేనేజర్**

**ఆలస్యంగా వెలుగులోకి...**

**చౌడేపల్లి జూన్ 10 సూర్య న్యూస్ :** మండలంలోని పందిళ్ళపల్లి గ్రామపంచాయతీ, బాలసముద్రంకు చెందిన గుండ్లూరు కృష్ణమూర్తి తన సొంత పనుల నిమిత్తం మంగళవారం సొంతపనుల నిమిత్తం పుంగనూరుకు వెళ్ళి తిరుగుముఖం పట్టాడు.బస్సు పుంగనూరు నుండి కలికిరి వెళ్తుంది. బస్సు నెంబర్ ఏపి03 జడ్ 5231 ఉదయం 11 గంటల సమయానికి కృష్ణమూర్తి బస్సు ఎక్కాడు.బస్సు కండక్టర్ టికెట్ అడగడంతో ఆధార్ కార్డు చూపిస్తూ ఇరవై రూపాయల నోటు ఇవ్వడంతో కండక్టర్ చిందులు వేస్తూ, దుర్భాషలాడుతూ నేనేమైనా మీకు కూలి మనిషినా ప్రతి ఒక్కరికి చిల్లర ఇవ్వడానికి అన్నాడుని ఆయన తెలాపారు. అనంతరం టికెట్టుకు పోగా మాగిలిన చిల్లర కోసం కృష్ణమూర్తి అడుగగా చాలా హీనంగా నోటితో చెప్పుకోలేని విధముగా మాట్లాడినట్లు కృష్ణమూర్తి తెలియజేశారు.అంతే కాకుండా వృద్దుడు అని కూడా చూడకుండా తన క్యాష్ బ్యాగ్ తో కొట్టగా కృష్ణమూర్తి క్రిందపడబోతే ప్రయాణీకులు పట్టుకున్నారు.ఈ విషయం పైన పుంగనూరు డిపో మేనేజర్ కు రాత పూర్వకంగా పిర్యాదు చేసినప్పటికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని కృష్ణమూర్తి వాపోయాడు.ఇకనైనా సఃబందిత అధికారులు సదరు బస్సు కండక్టర్ పైన చర్యలు తీసుకోవాలని కోరారు.




### జనసేన పార్టీ ఆశయాల కోసం

# పనిచేస్తున్న వ్యక్తి పిడుగు హరి ప్రసాద్

**పులివెందుల జనసేన నాయకులు దాసరి రవిశంకర్**

**వేంపల్లె జూన్ 10 సూర్య న్యూస్:** జనసేన పార్టీ ఆశయాల కోసం, సిద్ధాంతాల కోసం పనిచేస్తున్న వ్యక్తి పిడుగు హరి ప్రసాద్ అని పులివెందుల జనసేన పార్టీ నాయకులు డాక్టర్ దాసరి రవిశంకర్ కొనియాడారు. బుధవారం జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యదర్శి, ప్రభుత్వ విప్ మరియు గౌరవ ఎమ్మెల్సీ పిడుగు హరి ప్రసాద్‌కు దాసరి రవిశంకర్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దాసరి రవిశంకర్ మాట్లాడుతూ జనసేన పార్టీ ఆశయాల కోసం, సమాజంలో మార్పు కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న ఆత్మీయ నాయకులు హరి ప్రసాద్ అని, కష్టాల్లో ఉన్నవారికి కొండంత అండగా నిలుస్తూ, అందరినీ కలుపుకుపోయే మీ వ్యక్తిత్వం మాకు ఎంతో స్ఫూర్తి" అని కొనియాడారు. ఈ పుట్టినరోజు మీకు మరెన్నో విజయాలను, మరిన్ని గొప్ప బాధ్యతలను తీసుకురావాలని, ప్రజల గుండెల్లో నిలిచిపోయే నాయకుడిగా మీరు మరెన్నో ఏళ్లు ప్రజలకు సేవలందించాలని డాక్టర్ దాసరి రవిశంకర్ ఆకాంక్షించారు.



# ' సర్ ' పై అవగాహన సదస్సు

**జగ్గయ్యపేట జూన్ 10 సూర్యన్యూస్:** స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో జగ్గయ్యపేట పట్టణ, మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సర్ (ఎస్ఐఆర్)పై అవగాహన సదస్సు మిర్వహించారు.ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఉద్దేశ్యం, ప్రజలకు కలిగే ప్రయోజనాలు, పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణపై వివరంగా అవగాహన కల్పించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేసేందుకు ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.పార్టీ బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని,నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు, గౌరవరం సొసైటీ ఛైర్మన్ కట్టా వెంకట నరసింహారావు, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ అడుసుమల్లి ప్రభాకర్,ధూళిపాళ్ల లక్ష్మణరావు,పొట్టపొంగు బాబురావు, దర్శి విజయ నరసింహారావు, బొల్లెపల్లి భోజరాజు,వివిధ హోదాలలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# టైల్స్ వర్కర్స్ యూనియన్, పెంకు ఫ్యాక్టరీ యాజమాన్యం మధ్య చర్చలు విఫలం

**సమ్మె తీవ్రతరం చేస్తాం..యూనియన్ పిలుపు**

**మహబూబాబాద్ జూన్ 10 సూర్య న్యూస్:** బయ్యారం మండలం కొత్తపేట పూర్ణ టైల్స్ వేదికగా తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ పెంకు ఫ్యాక్టరీ యాజమాన్యం మధ్య చర్చలు బుధవారం నిర్వహించారు. చర్చలకు మహబూబాబాద్ జిల్లా భద్రాది కొత్తగూడెం యూనియన్ నాయకులు పెంకు ఫ్యాక్టరీ యాజమాన్యం హాజరైయ్యారు. కార్మికుల న్యాయమైన వేతనాలు పెంచాలని కార్మికుల డిమాండ్స్ ఆమోదించాలని యాజమాన్యన్ని కోరారు.కార్మికుల వేతనాలు పెంచడం కుదరదని మొండివైఖరితో వ్యవహరించిన పెంకు ఫ్యాక్టరీ యాజమాన్యం. పెంకు యాజమాన్యం మొండివైఖరిని నిరసిస్తూ ఈ నెల 12న బయ్యారం మండల కేంద్రంలో భారీ నిరసన ప్రదర్శన ఏర్పాటు చేస్తామని తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ తెలిపింది.సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోక్ ఈ చర్చల్లో పాల్గొన్నారు.పెంకు కార్మికులు చాలీచాలని వేతనాలతో అనేక ఇబ్బందులు గురవుతున్నారు ఇప్పటికైనా పెంకు ఫ్యాక్టరీ యజమాన్యం మొండి వైఖరి వీడనాడి కార్మికులతో చర్చలు జరపాలని లేనియెడల ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు వై బాగుల శ్రీను,నాయకులు వంగూరి వెంకన్న ఎస్.కె పాషా,సాంబయ్య,బుగ్గ రవి,రామచంద్రు,గణేష్,భానోత్ ఊట్ల, భూక్య లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.





సూర్య
జాతీయ తెలుగు దినపత్రిక

గురువారం 11 జూన్, 2026

## వర్షాకాలం ప్రారంభంలోనే పశువులకు ఉచిత జబ్బు
# వాపు వ్యాధి టీకాలు వేయించాలి: డాక్టర్ నాగరాజు

**డోన్ జూన్ 10 సూర్య న్యూస్:** వర్షాకాలంలో తెల్ల పశువులకు ప్రాణాంతకంగా మారే జబ్బు వాపు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు అందిస్తున్నందున రైతులు



తప్పనిసరిగా తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని డోన్ ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఆర్. నాగరాజు సూచించారు. ఈ నెల 10వ తేదీ నుంచి 30వ తేదీ వరకు డోన్ మండల వ్యాప్తంగా ఆవులు, ఎద్దులు, దూడలకు ఉచితంగా జబ్బు వాపు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. బుధవారం డోన్ అర్బన్ ప్రాంతంలో నిర్వహించిన టీకాల కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, చనుగొండ్ల పశు వైద్యాధికారి డాక్టర్ డి. భాను పాల్గొని పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జబ్బు వాపు వ్యాధి వ్యాప్తి చేసే సూక్ష్మజీవులు మట్టి, పచ్చిక బయళ్లలో ఉండి వర్షాకాలంలో కలుషితమైన మేత, నీటి ద్వారా పశువుల శరీరంలోకి ప్రవేశిస్తాయని తెలిపారు. వ్యాధి సోకిన పశువులు అధికంగా మరణించే ప్రమాదం ఉన్నందున ముందస్తు టీకాలే ఉత్తమ రక్షణ అని పేర్కొన్నారు.

**వ్యాధి లక్షణాలు:** 1)104 డిగ్రీల ఫారన్‌హీట్ వరకు అధిక జ్వరం 2)ఆకలి మందగించడం, మేత మేయకపోవడం 3)వేగంగా శ్వాస తీసుకోవడం..కుంటుతూ నడవడం 4)భుజం, తొడ భాగాల్లో నొప్పితో కూడిన వాపులు రావడం 5)రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..వ్యాధి రాకముందే తప్పనిసరిగా టీకాలు వేయించాలి 6)వ్యాధి సోకిన పశువులను వెంటనే వేరు చేయాలి 7)సోకిన పశువులు మేసిన ప్రాంతాల్లో ఇతర పశువులను మేయనివ్వకూడదు. వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి సంవత్సరం వర్షాకాలానికి ముందు టీకాలు వేయించాలి. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ మహమ్మద్ రఫీ, పశుసంవర్ధక శాఖ సిబ్బంది నవ్య తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేట సర్పంచ్ సీసీ రోడ్డు
# నిర్మాణం కొరకు పరిశీలన

**మహబూబాబాద్ జూన్ 10 సూర్య న్యూస్:** బయ్యారం మండలం గంధంపల్లి కొత్తపేట గ్రామపంచాయతీలో సిసి రోడ్డు నిర్మాణం చేయుటకు స్థానిక సంస్థల ఎన్నికల



సమయంలో ఇచ్చిన హామీ మేరకు సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ పంచాయతీలో గుంతలు పడి ప్రజలు నడవడానికి ఇబ్బందిగా ఉన్న కచ్చా రోడ్డును సిసి రోడ్డుగా మార్చుటకు నిధులు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా కాలనీ వాసుల చిరకాల కోరిక అయిన రోడ్డు నిర్మాణం కోసం కృషి చేసిన సర్పంచ్ ను అభినందిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రావి వీరభద్ర రావు,తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వడ్లమూడి కోటేశ్వరరావు, వార్డు సభ్యులు ఈసం స్వరూప,గ్రామస్తులు,ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ 12 ఏళ్ల సుపరిపాలనకు..
# ప్రత్యేక పూజలు

**డోన్ లో బీజేపీ ఆధ్వర్యంలో అర్చనలు- అభిషేకాలు**

**డోన్ జూన్ 10 సూర్య న్యూస్:** దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డోన్ పట్టణంలోని శివాలయం,విజయదుర్గ కనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు, అర్చనలు,



అభిషేకాలు నిర్వహించారు. దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం, శాంతి-సౌభాగ్యాల కోసం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు సందు వెంకటరమణ మాట్లాడుతూ, గత 12 ఏళ్లుగా ప్రధాని మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తూ ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠనుపెంచారనిఅన్నారు. ఆర్థిక,సాంకేతిక,మౌలిక వసతుల రంగాల్లో విశేష పురోగతి సాధించడంతో పాటు,వికసిత భారత్ లక్ష్య సాధనకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన,ఉజ్వల యోజన,జల్ జీవన్ మిషన్,స్వచ్ఛ భారత్,పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వంటి పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో మార్పు తీసుకువచ్చారని కొనియాడారు. దేశ భద్రత,డిజిటల్ విప్లవం,ఆర్థిక స్వావలంబన,యువతకు అవకాశాల కల్పనలో మోదీ తనదైన ముద్ర వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డోన్ మండల అధ్యక్షుడు బొంకూరి రవికుమార్,పట్టణ ఉపాధ్యక్షుడు దేవాదుల సుబ్రహ్మణ్యం, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్ సొప్పాకుల,జిల్లా ఉపాధ్యక్షుడు సందు అరుణ్ కుమార్,బిజెపి నాయకులు నాగరాజు,అనిల్,సురేష్,గణేష్,ఇతర బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోటసత్తెమ్మ ఆలయ వేలం పాటలు వాయిదా

**నిడదవోలు జూన్ 10 సూర్య న్యూస్:** మండలంలో తిమ్మరాజుపాలెం గ్రామంలోని శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో గురువారం (జూన్ 11) నిర్వహించాల్సిన కొబ్బరికాయల దుకాణం నెం.1, తలనీలాల (లాటు) హక్కుల బహిరంగ వేలం పాటలను వాయిదా వేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించాల్సిన ఈ వేలం పాటలు అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు వెల్లడించారు. తదుపరి బహిరంగ వేలం పాటల తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఆలయ కార్యాలయం నుంచి తాజా సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి. హరి సూర్యప్రకాశ్, ఫౌండర్ ఫ్యామిలీ సభ్యుడు దేవులపల్లి రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# కూటమి ప్రభుత్వ పాలనకు ప్రజల మద్దతుతో మరింత బలోపేతం

## చిప్పగిరిలో ఘనంగా నిర్వహించిన టీడీపీ మండల స్థాయి సమావేశం

**చిప్పగిరి జూన్ 10 సూర్య న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ మండల స్థాయి సమావేశం చిప్పగిరిలో పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడింది. మండల కన్వీనర్ కొండా పురుషోత్తమ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రభాకర్, జిల్లా నాయకురాలు కొండా తులసి, సొసైటీ చైర్మన్ కొండా రామాంజినేయులు, డీసీ ప్రెసిడెంట్ నగరడోన కిష్టప్ప ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రతి నెల రెండవ బుధవారం నిర్వహించే మండల స్థాయి సమావేశంలో యూనిట్ స్థాయి సమావేశాల నుంచి వచ్చిన సమస్యలు, సూచనలు, పార్టీ కార్యక్రమాల అమలు, ఓటరు జాబితా అంశాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. అలాగే హాజరైన సభ్యుల అటెండెన్స్ నమోదు చేసి, ఫీడ్‌బ్యాక్ ప్రశ్నలకు సమాధానాలు సేకరించారు. సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను మై టీడీపీ యాప్ ద్వారా నమోదు చేసి, కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను కూడా అప్‌లోడ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి వేగంగా అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన, పారదర్శక పాలన వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజల నుంచి విశేష



ఆదరణ లభిస్తోందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని, ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తూ, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు మాజీ మండల కన్వీనర్ వైకుంఠం వెంకటేశు,నంచర్ల శివలింగ, కోనంకి శ్రీనివాసులు, రామచంద్ర,కొలిమి శ్రీనివాసులు,భోగేష్ స్వామి, దౌల్తాపురం రామాంజిని,జనార్దన్ స్వామి, రామదుర్గం తిమ్మయ్య, కాజీపురం ఓబయ్య, రాఘవేంద్ర మరియు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీ బలోపేతానికి తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని తెలిపారు.

## అత్యధిక రోజులు ప్రధాన మంత్రిగా పనిచేసిన మోదీ

**నెహ్రూ రికార్డు బద్ధలు కొట్టిన మోదీ**

**పుంగనూరు జూన్ 10 సూర్య న్యూస్ :** వరుసగా మూడు సాధారణ ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలో కొనసాగుతున్న నరేంద్ర మోదీ అత్యధిక కాలం ప్రధానమంత్రి



పదవిలో కొనసాగిన నేతగా కొత్త రికార్డు సృష్టించారు. ఇప్పటివరకు జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న 4,398 రోజుల రికార్డును ఇవాళ్టితో అధిగమిస్తూ మోదీ చరిత్రలో తన పేరును లిఖించుకున్నారు. ఈ సందర్భంగా పుంగనూరు కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం నందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగదీష్ రాజు, మల్లికా రాణి, పెద్దమఠం బాబు, అరవపల్లి వెంకటరెడ్డి,ప్రసాద్, చంద్ర శేఖర్ రాజు, ఉమాశంకర్,వెంకటేష్,రమేష్,ఈశ్వరమ్మ, వేమారెడ్డి, కుమార్, జితేంద్ర,రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేత్రదానం మహాదానం..

**ఇద్దరి జీవితాల్లో వెలుగు నింపే అవకాశం**

**ధర్మవరం జూన్ 10 సూర్య న్యూస్:** మనిషి మరణించిన తర్వాత కూడా ఇతరులకు ఉపయోగపడే అమూల్యమైన దానం నేత్రదానమని రిటైర్డ్ జిల్లా అంధత్వ నివారణ అధికారి



డాక్టర్ సంకారపు నరసింహులు తెలిపారు. ప్రపంచ నేత్రదాన దినోత్సవం సందర్భంగా ఆయన ప్రజలకు అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. మరణించిన వ్యక్తి కళ్లను ఆరు గంటలలోపు నేత్రనిధి లేదా కళ్ల సేకరణ కేంద్రాలకు సమాచారం అందిస్తే, ఆ కళ్లలోని కార్నియాను సేకరించి అంధత్వంతో బాధపడుతున్న ఇద్దరికి చూపునిచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం కంటిలోని కార్నియా మాత్రమే సేకరిస్తున్నందున మృతదేహం ముఖాకృతిలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. చక్కెర వ్యాధిగ్రస్తులు, కంటి శుక్లం శస్త్రచికిత్స చేయించుకున్న వారు కూడా నేత్రదానం చేయవచ్చని తెలిపారు. అయితే పచ్చకామెర్లు, క్యాన్సర్, పిచ్చికుక్క కాటు కారణంగా మరణించిన వారి కళ్లను నేత్రదానానికి ఉపయోగించరని చెప్పారు. ప్రజలంతా నేత్రదానం ప్రాముఖ్యతను గుర్తించి ముందుకు వస్తే, చూపులేని వారి జీవితాల్లో వెలుగు నింపిన వారిగా నిలుస్తారని డాక్టర్ నరసింహులు పేర్కొన్నారు. మరణానంతరం కూడా తమ కళ్ల ద్వారా మరొకరి జీవితంలో వెలుగులు నింపే అవకాశం నేత్రదానం ద్వారా సాధ్యమవుతుందని ఆయన తెలిపారు.

## ఎట్టకేలకు భూతలింగేశ్వర్‌కు
# న్యాయం జరిగింది

**అంబేద్కర్, జతోత్ హుస్సేన్ నాయక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం**

**కడప జూన్ 10 సూర్య న్యూస్:** పెండ్లిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చి నెలలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల సందర్భంగా చోటుచేసుకున్న దౌర్జన్యాలు, అవమానకర ఘటనల విషయంలో గిరిజన ఉద్యోగి భూత లింగేశ్వర్‌కు న్యాయం జరిగేలా



జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ (ఎన్‌సీఎస్టీ) సకాలంలో జోక్యం చేసుకోవడం సామాజిక న్యాయ పరిరక్షణలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందని ఉమ్మడి కడప జిల్లా ప్రభుత్వ కళాశాలల ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చెప్పలి రాజారావు స్పష్టం చేశారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జతోత్ హుస్సేన్ నాయక్ చొరవతో రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి అధికారులకు తగిన ఆదేశాలు జారీ కావడంతో బాధితుడికి సత్వర న్యాయం అందించే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయని సంఘ నాయకులు తెలిపారు. ఈ పరిణామం బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణలో రాజ్యాంగబద్ధ సంస్థల పాత్ర ఎంత కీలకమో మరోసారి నిరూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, జిల్లా అధ్యక్షులు చెప్పాలి రాజారావు, జోనల్ సెక్రెటరీ బాలరాజు, ఉపాధ్యక్షులు సింగరయ్య, జాయింట్ సెక్రెటరీ చిన్న దుర్గన్న, స్టేట్ కౌన్సిల్ మెంబర్ బూతఅ లింగేశ్వర్, అధ్యాపకులు, సంఘ ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం కోసం రూ.10.50 లక్షల ఎల్‌ఓసీలు పంపిణీ

**విజయవాడ (రూరల్)జూన్ 10సూర్య న్యూస్:** ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.10 లక్షల 50 వేల విలువైన ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాలను ఎన్డీఏ నాయకులు బాధిత కుటుంబాలకు అందజేశారు. 46వ డివిజన్ లంబాడిపేటకు చెందిన షేక్ అమీరున్ పసికందుకు వైరల్ మయోకార్డైటిస్ చికిత్స కోసం రూ.4.92 లక్షల ఎల్‌ఓసీ, 51వ డివిజన్ కుమ్మరి వీధికి




చెందిన ఎస్. మెహర్ కల్యాణ్ వెన్నెముక చికిత్స కోసం రూ.5.58 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు త్వరితగతిన స్పందించి వైద్య సహాయం అందించిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి కృతజ్ఞతలు తెలియజేశాయి.

## కాల్‌మనీ బాధిత కుటుంబానికి అండగా నిలిచిన...
# మంత్రి సత్యకుమార్ యాదవ్

**హరికృష్ణ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు**

**అక్రమ వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవు - బాధిత కుటుంబానికి హరీష్ బాబు భరోసా**

**ధర్మవరం జూన్ 10 సూర్య న్యూస్ :** పట్టణంలో కాల్‌మనీ వేధింపులకు గురై దాడికి గురైన బాధితుడు బుర్రా హరికృష్ణ కుటుంబాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు బుధవారం పరామర్శించారు. ఇటీవల సాంకేతికంగా వెలుగులోకి వచ్చిన కథనాల ద్వారా ధర్మవరం పట్టణానికి చెందిన హరికృష్ణపై వడ్డీ వ్యాపారులు దాడి చేసిన విషయం తెలుసుకున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ వెంటనే స్పందించి, బాధిత కుటుంబాన్ని కలిసి వివరాలు తెలుసుకోవాలని హరీష్ బాబుకు సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు హరీష్ బాబు బాధితుడు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి చేరుకుని హరికృష్ణ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి జరిగిన ఘటనపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ... సాధారణ ప్రజలను అక్రమ వడ్డీ వ్యాపారులు వేధించడం, బెదిరించడం,



దాడులకు పాల్పడడం వంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం సహించబోదన్నారు. ప్రజల కష్టాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలతో ఇబ్బందులకు గురిచేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులతో మాట్లాడతామని తెలిపారు. వెంటనే పోలీసు అధికారులతో మాట్లాడి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ ఘటనను అత్యంత తీవ్రంగా పరిగణించారని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హరికృష్ణ కుటుంబానికి ప్రభుత్వం మరియు బీజేపీ అండగా ఉంటుందని, ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. ప్రజల భద్రత, గౌరవం, ఆస్తి పరిరక్షణ ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్న హరీష్ బాబు, ధర్మవరంలో ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు ఈ వ్యవహారాన్ని నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబిలేసు, ప్రకాష్ గౌడ్, డి.చెర్లోపల్లి నారాయణస్వామి, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

EDITED PUBLISHED AND WONEDBY N.MAHESWARA REDDY PUBLISHED AT D.NO 1/171/2 DEVANAKONDA (M&POST) 518465, KURNOOL DIST, AP, PRINTED AT SRI LAKSHMI OFFSET PRINTERS AND PUBLICATIONS D.NO 1/171/2 DEVANAKONDA (M&POST)518465 KURNOOL DIST. CONTRACT CELL NO. 9010008143,RNI APTEL 2022/82194 Gmail :suryavelugutelugu daily@gmail.com

### శ్రీ తిరుపతమ్మ అమ్మవారి సేవలో...
# స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**జగ్గయ్యపేట జూన్ 10 సూర్య న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు,ఆయన కుమారుడు రాజ్యసభ సభ్యులు విజయ్ కుటుంబ సభ్యులతో కలిసి పెనుగంచిప్రోలు గ్రామంలోని శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు.ఆలయం వద్ద కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్,ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తదితర టీడీపీ ముఖ్యనాయకులు స్వాగతం పలికారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే తమ గృహానికి ఆహ్వానించారు. ఆహ్వానం మేరకు వారి నివాసానికి విచ్చేసిన స్పీకర్ కుటుంబ సభ్యులకు శ్రీరాం తాతయ్య సోదరులు, సాయి ప్రసాద్, శ్రీరాం ధనుంజయ్ (చిన్నబాబు) ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా అతిథుల కోసం ప్రత్యేకంగా ప్రేమ విందును ఏర్పాటు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు పరస్పరం ఆత్మీయంగా ముచ్చటించుకుని వివిధ అంశాలపై చర్చించారు.




### కడప క్రికెట్ టోర్నీలో ఆల్‌రౌండ్ ప్రతిభ
# కనబరిచిన అడబాల

**కోనసీమ/ఆలమూరు జూన్ 10 సూర్య న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్లో అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం





చెముడులంక గ్రామానికి చెందిన అడబాల శ్రీ రామకృష్ణ ఆల్ రౌండ్ చాంపియన్ గా నిలిచారు. కడపలో ఈనెల 4న ప్రారంభమైన ఈ టోర్నమెంట్ కు రాష్ట్ర వ్యాప్తంగా 40 జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన ఫైనల్ లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమండ్రి జట్టు-విశాఖ జట్టు తలబడ్డాయి. చివరికి రాజమండ్రి జట్టు విజయం సాధించింది. అడబాల బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి మొదటి టీమ్ పై మాన్ అఫ్ ది మ్యాచ్ బహుమతిని అందుకున్నారు. ఈ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉన్న రాజమహేంద్రవరం విద్యుత్ శాఖ ఎస్సీ తిలక్ కుమార్ ప్రోత్సాహంతో ఈ జట్టు విజేతగా నిలిచింది. ప్రస్తుతం కడియం మండలం దుళ్ల విద్యుత్ లైన్ మెన్ గా పనిచేస్తున్న అడబాల జట్టు విజయానికి కీలక పాత్ర పోషించడంపై తిలక్ కుమార్ తో పాటు కెప్టెన్ బల్జి వాసు టీం ప్లేయర్స్ పలువురు విద్యుత్ శాఖ అధికారులు అభినందించారు.ఇదిలా ఉండగా ఈ జట్టు ఇప్పటి వరకు తొమ్మిది సార్లు చాంపియన్ గా నిలిచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది.ఇప్పటి వరకూ రాష్ట్రంలో ఏ జట్టూ ఇన్ని సార్లు టోర్నమెంట్ విజేతగా లేక పోవడం విశేషం.

## రైతులకు పసుదాణ సరఫరా కార్యక్రమం

**కుప్పం జూన్ 10 సూర్య న్యూస్:** మండల పరిధిలోని దాసేగా నూరు పంచాయతీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ తరపున రైతులకు పశుదాణ సరఫరా కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీలో ఆవులు ఉన్న ప్రతి ఒక్క రైతు కుటుంబానికి పశు దాణ పంపిణీ కార్యక్రమం చేపట్టమన్నారు.అలాగే పాడి పశువులు ఉన్న ప్రతి ఒక కుటుంబానికి పశుదాన పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వసుదాన 50 కేజీల బస్తా ధర రూ. 1110 ఉండగా 50 శాతం సబ్సిడీతో రూ. 555 మాత్రమే రైతులు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పి ఎస్ మునిరత్నం, రాష్ట్ర డైరెక్టర్ చెక్కునత్తం మణి, టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, మండల పార్టీ అధ్యక్షులు రాజగోపాల్,మాజీ ఏఎంసీ చైర్మన్ స్వతంత్ర శేఖర్, శరవణ,కడ సభ్యులు రామచంద్ర, ధన శేఖర్, మురళి,సుబ్బు తదితరులు పాల్గొన్నారు.




### అమెరికన్ ఇండియా ఫౌండేషన్ మరియు లాడ్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో
# ఆశ వర్కర్లకు హెచ్‌బిఎంసి శిక్షణ

**హుకుంపేట జూన్ 10సూర్య న్యూస్:** మండలంలో అల్లంపుట్టు బాయ్స్ ఆశ్రమ పాఠశాల లో ఆశా వర్కర్లకు మరియు సిహెచ్దబ్ల్యులకు హెచ్ బి ఎం సి గురించి శిక్షణ కార్యక్రమ జరిగింది.ఈ కార్యక్రమంలో మాన్సీ ప్రోగ్రాం సిబ్బంది ఆశలకు రెండు రోజులపాటు ఇంటి వద్ద గర్భవతి మరియు నవజాత శిశు సంరక్షణ గురించి వివరించారు అలాగే ఈ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా హుకుంపేట పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ సౌజన్య ట్రైనింగ్ కార్యక్రమాన్ని సందర్శించారు అలాగే శిక్షణ మెరుగైన మెలకువలు. గురించి ఆశాలను ప్రశ్నలు వేశారు. అలాగే వారు ఏం నేర్చుకున్నారో ఆమె తెలుసుకున్నారు.అంతే కాకుండా ఆశ కార్యకర్తల యొక్క గృహ సందర్శనలను ఇంకా మరింత బలోపేతం చేయాలని ఆశలకు దిశా నిర్దేశం చేశారు.తద్వారా మాతృ మరియు నవజాత శిశువు మరణాలను తగ్గించవచ్చు అని చెప్పడం జరిగింది.ఈ విధంగా హుకుంపేట మండలంలో గత 15 రోజులుగా ఉప్పా మరియు హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎప్పటి వరకు 294 మంది ఆశా మరియు సిహెచ్ డబ్ల్యు లకు శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో హుకుంపేట మండల కో ఆర్డనేటర్ పి. సురేష్ రెడ్డి, క్లస్టర్ కో ఆర్డనేటర్స్, దుడ్డు వినోద్ కుమార్,శైలజ, కామాక్షి,మాన్సీ మిత్రాలు పాల్గున్నారు.




### శ్రీశైలంలో ఆర్థిక అక్షరాస్యత సదస్సు - బ్యాంకింగ్ మోసాలపై
# అవగాహన కార్యక్రమం

**శ్రీశైలం(దేవస్థానం) జూన్ 10 సూర్య న్యూస్:** శ్రీశైలంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆత్మకూర్ వారి ఆధ్వర్యంలో బ్యాంకింగ్ కార్యక్రమాల పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ లు ఓ.శంకరయ్య , బి.విజయరాజు. సిఐటియు. జిల్లా కమిటీ సభ్యులు ఎం.చిన్న మారన్న. సిఐటియు శ్రీశైలం మండల అధ్యక్షులు దర్శనం నాగరాజు, మాట్లాడుతూ అందరూ బ్యాంకు ఖాతాలు కలిగి ఉండాలని వాటిని ఉపయోగిస్తూ ఉండాలని తెలియజేయడం జరిగింది. బ్యాంకు ఖాతాలు గురించి, నామిని గురించి, పొదుపు ఎలాచేసుకోవాలి, డిఐసిజిసి గురించి, ఓటీపీలు ఎవరికి చెప్పకూడదని ఓటీపీలు చెబితే ఖాతాలో ఉన్న డబ్బుల ను మోసగాళ్లు కాజేస్తారు అని తెలియ చేయడం జరిగింది.18 నుంచి 50 సంవత్సరాలు లోపు ఉన్న ప్రతి ఒక్కరు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం ద్వారా 436 ఇన్సూరెన్స్ ప్రీమియం, అలాగే 18 నుంచి 70 సంవత్సరాలు వయసు ఉన్నవాళ్లు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం ద్వారా 20 రూపాయలు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలియజేయడం జరిగింది. ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన ఇన్సూరెన్స్ చేయించుకోవడం ద్వారా ఒక వ్యక్తి సాధారణంగా మరణిస్తే ఆ మరణించిన వ్యక్తి నామినీకి ఇన్సూరెన్స్ ద్వారా రెండు లక్షల రూపాయలు రావడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది. అదేవిధంగా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన చేసుకోవడం ద్వారా ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే 2 లక్షల రూపాయలు మరణించిన వ్యక్తి నామినీకి రావడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది. సుకన్య సమృద్ధి యోజన గురించి, బ్యాంకు యొక్క రుణ సదుపాయాల గురించి అవగాహన పెంచడం జరిగింది. అలాగే ఈ-శ్రమ్ కార్డ్ ,లేబర్ కార్డ్ వల్ల ఉపయోగాల గురించి తెలియ జేశారు ప్రతి భవననిర్మాణ కార్మికులు అందరూ ఈ కార్డ్ చేయించుకుని ఉపయోగించుకోవాలని తెలియజేశారు.




# బాలల హక్కుల సంరక్షణకు కృషి

**కుక్కునూరు జూన్ 10 సూర్య న్యూస్ :** బాల కార్మికులు, బాల్య వివాహాలు లేని బాలల స్నేహపూర్వక గ్రామాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం,చైల్డ్ ఫండ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో కుక్కునూరు మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉండవల్లి గాంధీ బాబు మాట్లాడుతూ, బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారులు బాలల సమస్యలపై నిరంతరం సమీక్షలు నిర్వహించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జామాయిల్, మిర్చి తోటలు వంటి ప్రాంతాల్లో బాల కార్మికులు పనిచేసే అవకాశం ఉన్నందున గ్రామ, మండల స్థాయి కమిటీలు తరచూ తనిఖీలు నిర్వహించాలని, బాల కార్మికులను గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. బాలల విద్య, ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, బాల కార్మికులు లేని సమాజ నిర్మాణమే అందరి లక్ష్యంగా ఉండాలని ఉండవల్లి గాంధీ బాబు పిలుపునిచ్చారు. మండలంలోని వలస ఆదివాసీ పిల్లల విద్యాభ్యాసానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, విద్యా హక్కు చట్టం ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలు తప్పనిసరిగా పాఠశాలల్లో ఉండేలా అవసరమైన ధ్రువపత్రాలు అందించి వారిని చేర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మండలంలోని రామాపురం, గుట్టపుతోగు, రేగులచెరువు గ్రామాలకు చెందిన వలస ఆదివాసీలు తమ పిల్లలకు ఆధార్ కార్డులు మంజూరు చేయాలని గౌరవ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కుక్కునూరు డిప్యూటీ తహసీల్దార్ రమేష్ బాబు, ఎంపీడీవో కె.సి.హెచ్. నాగరాజు, సీడీపీఓ యు.వి.వి. అనంతలక్ష్మి, చైల్డ్ ఫండ్ ఇండియా భద్రాచలం ఫీల్డ్ ఆఫీసర్ ఎన్. బుచ్చిబాబు, జిల్లా బాలల సంరక్షణ విభాగం సభ్యులు వై. రాజ్‌కుమార్, పి. రాజేష్, ఎంఈవో--2 టి.జి. భగవాన్ దాస్, ఓఎఫ్ఐ ప్రతినిధి బి.మణి గోపాల్, చైల్డ్ ఫండ్ ఇండియా సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్వైజర్లు రుక్మిణి, మయూరి,పంచాయతీ సెక్రటరీలు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



### తెలుగుదేశం పార్టీ బలోపేతంపై
# ఎమ్మెల్యే ముప్పిడి సమీక్ష

**కొవ్వూరు జూన్ 10 సూర్య న్యూస్:** మండలంలోని దొమ్మేరు గ్రామంలోని ఇంద్రప్రస్థ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన కొవ్వూరు మండల తెలుగుదేశం పార్టీ సమావేశంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంపై నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. మండల స్థాయిలో పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచిస్తూ కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు, మండల, గ్రామ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వేంపల్లె గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చి దిద్దుతాం

### ప్రత్యేక అభివృద్ధి అధికారి వెంకట సుబ్బయ్య

**వేంపల్లె జూన్ 10 సూర్య న్యూస్:** వేంపల్లె గ్రామపంచాయతీని పూర్తిగా ప్లాస్టిక్ రహిత గ్రామంగా ప్రకటిస్తున్నట్లు ప్రత్యేక అధికారి వెంకట సుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు గ్రామంలోని అన్ని వ్యాపార సంస్థల యాజమాన్యాలకు సమాచారం అందించారు. ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ సంబంధిత వస్తువుల వాడకాన్ని 15 రోజుల్లో పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించారు. 15 రోజుల తర్వాత గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తనిఖీలు మొదలుపెడతామని, ప్లాస్టిక్ వినియోగిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ అభివృద్ధి కి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు.




# ఎస్ ఐ ఆర్ ను పకడ్బందీగా నిర్వహించాలి

### - మండల టిడిపి సమాఖ్య

**మండల స్థాయి శిక్షణ తరగతులలో పాల్గొన్న టిడిపి నేతలు**

**హోళగుంద జూన్ 10 సూర్య న్యూస్:** ఎస్ ఐ ఆర్ సర్వేను బూత్ లెవెల్ ఏజెంట్లు మరియు క్లస్టర్ ఇన్చార్జిలు పార్టీ అనుబంధ సంస్థ నాయకులు కార్యకర్తలు సభ్యులు పకడ్బందీగా నిర్వహించాలని మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య అన్నారు.ఈ సందర్భంగా స్థానిక ఎల్లెల్సీ అతిథి గృహం నందు ఆలూరు టిడిపి ఇన్చార్జి వైకుంఠం జ్యోతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాద్ ఆదేశాల మేరకు క్లస్టర్ ఇంచార్జి వీరేంద్ర అధ్యక్షతన ఎస్ ఐ ఆర్ పై మండల స్థాయి నాయకుల సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అబ్దుల్ సుభాన్ ,సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, డైరెక్టర్ దుర్గయ్య, మండల కో కన్వీనర్ జాకీర్, ఆలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముల్లా నబి రసూల్, మండల ప్రధాన కార్యదర్శి గోవిందు గౌడ్, సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రాజా పంపన్న గౌడ్, మాజీ తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శేషగిరి, మురళీధరాచారి, ఎస్.పంపాపతి, ఎర్రిస్వామి, బాబు సాబ్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి క్లస్టర్ ఇన్చార్జిలు మాట్లాడుతూ ప్రతి యూనిట్ నుండి వచ్చిన ప్రధాన సమస్యలు సూచనలు పార్టీ కార్యక్రమాలు ప్రభుత్వ సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాల అమలు పై వారు మాట్లాడారు. అలాగే ఎస్ ఐ ఆర్ సర్వే మరియు ఓటర్ లిస్టు అంశాలపై ప్రతి ఒక్క బూత్ లెవెల్ ఏజెంట్ పకడ్బందీగా పాల్గొని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు వచ్చేలా చూసే బాధ్యత టిడిపి బూత్ లెవెల్ ఏజెంటుగా దేనిని అన్నారు. అలాగే హాజరైన సభ్యులు వారి హాజరును మై టిడిపి యాప్ ద్వారా అటెండెన్స్ నమోదు చేసి ఫీడ్బ్యాక్ క్యూస్షన్స్కు సమాధానాలు ఇచ్చారు. అలాగే పలు తీర్మానాలు రూపొందించి మై టిడిపి యాప్ లో నమోదు చేయడం జరిగింది. అలాగే పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన సంస్థాగత నిర్మాణాలు మరియు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించాల్సిన పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు శాలి మహబూబ్ బాషా, బాగోడి రాముడు, హనుమప్ప, సలీం, వెంకటేష్, క్లస్టర్ కన్వీనర్లు కోకన్వీనర్లు యూనిట్ కన్వీనర్లు యూనిట్ కో కన్వీనర్లు బూత్ కన్వీనర్లు కోకన్వీనర్లు మండల మరియు గ్రామ కమిటీ నాయకులు సభ్యులు టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# ప్రీస్కూల్ చిన్నారుల చేరికల కోసం అంగన్వాడి బాట

**నిడదవోలు జూన్ 10 సూర్య న్యూస్:** పెరవల్లి ప్రాజెక్టు పరిధిలోని నిడదవోలు సెక్టార్ ఎస్టి కాలనీలో అంగన్వాడి బాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రీస్కూల్ వయస్సు కలిగిన చిన్నారులను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించి ప్రభుత్వ సేవలను అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి ఉపాధ్యా యులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చిన్నారుల వివరాలను సేకరించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న ప్రాథమిక విద్య, పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, టీకాలు, గర్భిణులు మరియు బాలింతలకు అందించే సేవల గురించి తల్లిదండ్రులకు వివరించారు. చిన్నారుల శారీరక, మానసిక, మేధో వికాసానికి అంగన్వాడి కేంద్రాలు ఎంతో దోహదపడతాయని, ప్రతి అర్హత కలిగిన చిన్నారిని కేంద్రంలో చేర్పించాలని కోరారు.అలాగే చిన్నారుల్లో విద్యపై ఆసక్తి పెంపొందించేందుకు అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహిస్తున్న వివిధ విద్యా, సృజనాత్మక కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకునేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 112, 117, 132, 134, 135 అంగన్వాడి కేంద్రాల ఉపాధ్యాయులు పాల్గొని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. స్థానికులు కార్యక్రమానికి సహకరించి చిన్నారుల చేరికలకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.



# కూటమిది ప్రజా రంజక పాలన

## రావులపాలెంలో మండల తెలుగుదేశం పార్టీ సమావేశం

**కోనసీమ/రావులపాలెం జూన్ 10 సూర్య న్యూస్:** రెండేళ్ల ఎన్డీఏ కూటమి ఫాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు వెళ్తోందని చంద్రబాబు నాయుడు ప్రజారంజకపాలన



అందిస్తున్నారని రావులపాలెం మండల టిడిపి అధ్యక్షుడు కొప్పిశెట్టి ప్రసాద్ అన్నారు. రావులపాలెం మండల తెలుగుదేశం పార్టీ సమావేశం బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లోకొప్పిశెట్టి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో రాష్ట్రంలోనూ రావులపాలెం మండలంలోనూ జరిగిన అభివృద్ధి సంక్షేమం గురించి వివరించారు. సమావేశంలో గుత్తుల పట్టాభి రామారావు, చిలువూరి సతీష్ రాజు జక్కంపూడి బాలాజీ, గురవయ్య నాయుడు, పోలవరపు శ్రీనివాస్, పసుపులేటి రాధాకృష్ణ, మానే ప్రసాద్ పడాల బుల్లి కొండారెడ్డి, చిట్టూరి శ్రీను, కుసుమే సురేష్, బొంతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఐఆర్ పై ఆలూరులో...

# టిడిపి మండల స్థాయి సమావేశం

**ఆలూరు (రూరల్) జూన్ 10 సూర్య న్యూస్:** ఎస్ ఐ ఆర్ పై ఆలూరులో బుధవారం ఆలూరు టిడిపి ఇన్చార్జి వైకుంఠం జ్యోతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ వైకుంఠం శివప్రసాద్ల



ఆదేశాల మేరకు టిడిపి మండల స్థాయి సమావేశం మండల టిడిపి కన్వీనర్ అసెంబ్లీ కటారి కొండ సీనప్ప, క్లస్టర్ ఇంచార్జి షేక్షావలి, జిల్లా నాయకులు చెన్నంగి నరసప్ప ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. జూన్ నెల కు సంబంధించి రెండవ బుధవారం మండల స్థాయి సమావేశం నిర్వహించటంతో ఈ సమావేశంలో యూనిట్ స్థాయి సమావేశాల నుండి వచ్చిన ప్రధాన సమస్యలు సూచనలు పార్టీ కార్యక్రమాలు ప్రభుత్వ సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాల అమలు ఓటర్ లిస్టు అంశాలపై సమీక్ష నిర్వహించటం జరిగింది. హాజరైన సభ్యుల హాజరును మై టిడిపి యాప్ లో అప్లోడ్ చేశారు . ప్రశ్నోత్తరాలు తీర్మానాలు మరియు ఇతర సమస్యలను ఆ యాప్ లో అప్లోడ్ చేయడం జరిగింది. అలాగే సమావేశ ఫోటోలు కూడా అప్లోడ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూత్ ఇన్చార్జీలు యూనిట్ ఇన్చార్జీలు గ్రామ అధ్యక్షులు సీనియర్ టిడిపి నాయకులు అనుబంద సంస్థ సభ్యులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### సిటీ యూనియన్ బ్యాంక్ సేవలను

# సద్వినియోగం చేసుకోవాలి

**: బ్రాంచ్ మేనేజర్ బల్లేపల్లి శేషాద్రి**

**శ్రీకాళహస్తి జూన్ 10 సూర్య న్యూస్:** పట్టణంలో కొత్తగా ప్రారంభమైన సిటీ యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ ద్వారా పురప్రజలు, పరిసర గ్రామాల ప్రజలు, వ్యాపారులు మరియు




రైతులకు అత్యంత సురక్షితమైన, వేగవంతమైన అధునాతన బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయని బ్రాంచ్ మేనేజర్ బల్లేపల్లి శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతాదారుల విభిన్న రకాల ఆర్థిక అవసరాలను తీర్చేందుకు బ్యాంక్ ద్వారా ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు, సులభమైన వాయిదాలతో కూడిన హౌసింగ్ లోన్స్ (గృహ రుణాలు), స్థానిక వ్యాపారాల విస్తరణకు మరియు చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడే వ్యాపార రుణాలు, అలాగే అత్యవసర అవసరాల కోసం అత్యంత వేగంగా మంజూరయ్యే బంగారు రుణాలు (గోల్డ్ లోన్స్) ప్రత్యేకంగా అందిస్తున్నట్లు ఆయన వివరించారు. వీటితో పాటు రైతాంగాన్ని ఆదుకునేందుకు తక్కువ వడ్డీకే వ్యవసాయ రుణాల సదుపాయం కూడా కల్పించామని, కావున శ్రీకాళహస్తి మరియు రూరల్ పరిధిలోని ప్రజలు, రైతులు, వర్తకులు ఈ నూతన శాఖను సందర్శించి ఇక్కడి విభిన్న రుణ సదుపాయాలను, డిజిటల్ బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ మేనేజర్ బల్లేపల్లి శేషాద్రి కోరారు.

# రాయలచెరువులో ఎరువుల డీలర్లపై చర్యలు

**యాడికి జూన్ 10 సూర్య న్యూస్:** మండలంలోని రాయలచెరువు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీఎయిమ్స్ యాప్ ద్వారా యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీ





నిబంధనలు ఉల్లంఘించిన డీలర్లపై వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. పరిశీలనలో భాగంగా శ్రీ శ్రీనివాస ట్రేడర్స్ ఎరువుల లైసెన్సును 15 రోజుల పాటు సస్పెండ్ చేయగా, న్యూ లక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ మరియు మన గ్రోమోర్ సెంటర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జూన్ 8 నుంచి ఏపీఎయిమ్స్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ అమల్లోకి వచ్చినప్పటికీ, కొందరు డీలర్లు పాత విధానంలోనే విక్రయాలు నిర్వహించినట్లు గుర్తించిన అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో గుత్తి డివిజన్ సహాయ సంచాలకులు వెంకటరాముడు, మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**నరసరావుపేటజూన్ 10 సూర్య న్యూస్:** పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక గడియార స్తంభం సెంటర్లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం బుధవారానికి 18



రోజులకు చేరుకుంది. ఈ మజ్జిగ పంపిణీ కి కీర్తిశేషులు సిహెచ్ సీతారామిరెడ్డి కుటుంబ సభ్యులు సహాయ సహకారం అందించారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ న్యాయవాది చిన్నపరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షులు చింతలచెరువు గురునాథ చారి, ఉపాధ్యక్షులు గుత్తికొండ భాస్కరాచారి, కార్యదర్శి అమ్మనబ్రోలు మల్లికార్జున చారి లు . కోటేశ్వర చారి. పాల్గొన్నారు.

# మర్రిపాడులో మార్పు మంత్రం..!

## గ్రూపు రాజకీయాలకు గుడ్‌బై చెప్పాలంటున్న యువత...రోజులు మారాయి... పంచాయతీ పోరుకు సిద్ధమవుతున్న కొత్త తరం

**మర్రిపాడు జూన్ 10 సూర్య న్యూస్ :** ఒకప్పుడు మర్రిపాడు రాజకీయాలు అంటే కొన్ని కుటుంబాలు, కొన్ని వర్గాలు, కొన్ని గ్రూపుల చుట్టూనే తిరిగేవి. గ్రామంలో ఎవరు ఏ గ్రూపులో ఉన్నారు, ఎవరి వెంట నడుస్తున్నారు, ఎవరికి మద్దతు ఇస్తున్నారు అన్నదే రాజకీయ భవిష్యత్తును నిర్ణయించేది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి. రాబోయే పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో వినిపిస్తున్న చర్చలు, యువతలో కనిపిస్తున్న ఆలోచనా విధానం గతానికి భిన్నంగా ఉండటం విశేషంగా మారింది. మర్రిపాడులో దశాబ్దాలుగా గ్రూపు రాజకీయాలు బలంగానే ఉన్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ప్రధానంగా పోటీ పడుతున్న గ్రూపులన్నీ కూడా ఒకే సామాజిక వర్గానికి చెందిన నాయకత్వం చుట్టూనే తిరుగుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో సాధారణ ప్రజలు, ముఖ్యంగా రాజకీయాలకు దూరంగా ఉండాలనుకునే కుటుంబాలు తీవ్ర అయోమయంలో పడుతున్నాయి. ఏ గ్రూపులో కనిపించినా మరో గ్రూపు దూరమవుతుందేమో, ఎవరికైనా మద్దతు ఇచ్చినట్లు భావిస్తారేమో, భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయేమో అన్న ఆందోళన సామాన్యుల్లో కనిపిస్తోంది. గ్రామంలో ప్రస్తుతం వినిపిస్తున్న మాట కూడా అదే. "ఏ గ్రూపులో ఉంటే ఏమి ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడింది" అని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నట్లు సమాచారం. రాజకీయ విభేదాలు వ్యక్తిగత సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయనే అభిప్రాయం కూడా గ్రామంలో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో గ్రూపుల మధ్య చిక్కుకోకుండా గ్రామాభివృద్ధి గురించి మాట్లాడే నాయకత్వం




అవసరమనే అభిప్రాయం క్రమంగా బలపడుతోంది. ఇదే సమయంలో మరో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంటోంది. గ్రామంలోని వివిధ సామాజిక వర్గాలకు చెందిన యువతలో మార్పు కోరుకునే భావన పెరుగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో రాజకీయాలు అంటే కొందరి హక్కుగా భావించిన పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు చదువుకున్న యువత, ఉద్యోగులు, వ్యాపారులు, సామాజిక సేవకులు కూడా ప్రజా జీవితంలోకి రావాలనే ఆసక్తి చూపుతున్నారని గ్రామస్థాయి చర్చలు సూచిస్తున్నాయి. ప్రత్యేకంగా యువతను కదిలిస్తే ఒకే సమాధానం వినిపిస్తోందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి --- "రోజులు మారాయి... ఇప్పుడు మార్పు కావాలి". ఇదే భావన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. వ్యక్తుల ఆధిపత్యం కంటే వ్యవస్థలో మార్పు కావాలని, గ్రూపు రాజకీయాల కంటే గ్రామాభివృద్ధి ముఖ్యమని యువత అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. ఈసారి పంచాయతీ ఎన్నికల్లో అన్ని వర్గాల నుంచి అభ్యర్థులు రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారనే ప్రచారం కూడా ఊపందుకుంది. గతంలో పోటీ చేయడానికి వెనుకంజ వేసిన కుటుంబాలు కూడా ఇప్పుడు పరిస్థితులను పరిశీలిస్తున్నాయని సమాచారం. అధికార, ప్రతిపక్ష పార్టీలకు అనుబంధంగా ఉండే సంప్రదాయ సమీకరణాలకు అతీతంగా స్వతంత్రంగా పోటీ చేయాలనే ఆలోచనలో కొందరు ఉన్నారని గ్రామ రాజకీయాల్లో చర్చ సాగుతోంది. అయితే మర్రిపాడులో గ్రూపు రాజకీయాల ప్రభావం పూర్తిగా తగ్గిపోయిందని చెప్పడం ఇప్పుడే సాధ్యం కాదు. దశాబ్దాలుగా ఏర్పడిన రాజకీయ సమీకరణాలు, బంధుత్వాలు, వ్యక్తిగత అనుబంధాలు ఇంకా ప్రభావం చూపుతూనే ఉన్నాయి. కానీ వాటికి ప్రత్యామ్నాయంగా కొత్త ఆలోచనలు, కొత్త నాయకత్వం, కొత్త రాజకీయ సంస్కృతి గురించి చర్చ మొదలవ్వడం మాత్రం గమనించదగ్గ పరిణామంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఏది ఏమైనా ఈసారి మర్రిపాడు పంచాయతీ ఎన్నికలు కేవలం అభ్యర్థుల మధ్య పోటీగా కాకుండా, పాత గ్రూపు రాజకీయాలకు -- కొత్త తరం మార్పు ఆలోచనలకు మధ్య జరిగే పోరుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల నగారా మోగే సమయానికి ఈ మార్పు గాలి ఎంత బలపడుతుందో, సామాన్య ప్రజలు మరియు యువత ఎటువైపు మొగ్గు చూపుతారో అన్నది ఇప్పుడు మర్రిపాడు రాజకీయాల్లో అత్యంత ఆసక్తికర అంశంగా మారింది.

### బొజ్జల రిషితా రెడ్డి జన్మదిన సందర్భంగా రక్తదానం చేసిన

# తెదేపా దళిత నాయకుడు గొప్పల రంగయ్య

**శ్రీకాళహస్తి జూన్ 10 సూర్య న్యూస్:** శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషిత రెడ్డి జన్మదిన సందర్భంగా శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లో తొట్టంబేడు మండల






అధ్యక్షులు రావిళ్ళ ముని రాజా నాయుడు, ఘట్టమనేని శంకర్ నాయుడు, యువ నాయకుడు చిట్టతూరు బాలాజీ రెడ్డి ఆధ్వర్యం లో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాతృ మూర్తి బొజ్జల బృందమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో లింగం నాయుడు పల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ దళిత నాయకుడు కొప్పల రంగయ్య ఆధ్వర్యంలో సుమారు తెలుగుదేశం పార్టీకి చెందిన పదిమంది కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేస్తున్న కొప్పుల రంగయ్యను బొజ్జల బృందమ్మ అభినందించి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఉండే మీలాంటి యువత ముందుండి రక్తదానం చేయడం చాలా అభినందనీయమని, అదేవిధంగా మా కుటుంబం కష్టపడ్డ ప్రతి కార్యకర్త ను గుర్తుపెట్టుకుంటామని తెలియజేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ర్యాలీ శ్రీ జగన్మోహిని కేశవ స్వామి

# ఆలయానికి భక్తులు విరాళం

**కోనసీమ/ఆత్రేయపురం జూన్ 10 సూర్య న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రం ర్యాలీ శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. అనంతరం






స్వామివారిని దర్శించుకుని నిత్య అన్నదాన అభివృద్ధికి విరాళాలు అందజేస్తున్నారు. హిందూపురం చెందిన దొంతి రామదాసు బుధవారం స్వామివారి దర్శించుకున్నారు. అనంతరం అన్నదాని అభివృద్ధి కోసం 10,116 రూపాయలను విరాళంగా అందజేశారు. ఇదే తరహాలో రాజమహేంద్రవరం రూరల్ మండలం నామవరం గ్రామానికి చెందిన నమ్మి హరికృష్ణ, సత్యవేణి దంపతులు కలిసి స్వామివారిని దర్శించుకుని11,001 రూపాయలను ఆలయ ఈవో దారపు రెడ్డి సురేష్ బాబుకు, అందజేశారు. విరాళం దాతలను ఆలయ ఈవో కృతజ్ఞతలు తెలిపి స్వామివారి చిత్రపటం ఇచ్చి సత్కరించారు.

### వైజాగ్ స్టీల్ మృతులకు ప్రగాఢ సంతాపం తెలియజేసిన

# తలపా దామోదరం రెడ్డి

**శ్రీకాళహస్తి జూన్ 10 సూర్య న్యూస్:** వైజాగ్ స్టీల్ ప్లాంట్ నందు మృతి చెందినటువంటి కార్మికుల కుటుంబాలకు శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్తతలపా



దామోదరం రెడ్డి కార్యకర్తలతో కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దామోదర్ రెడ్డి మాట్లాడుతూ మరుగుతున్న స్టీల్ పడటంతో 9 మంది కార్మికులు సజీవ దహనం అయ్యారని మృతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలనిఈ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని, మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, శంకర్, గిరీష్, దిలీప్, అరుణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### ల్యాండ్ పూలింగ్ వివరాలను...

# సీఆర్డీఏకు అందించండి

**: జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా**

**అమరావతి/నరసరావుపేట జూన్ 10 సూర్య న్యూస్:** మండలంలో ల్యాండ్ పూలింగ్ (భూసమీకరణ)కు అంగీకరించిన రైతుల వివరాలతో పాటు, దేవాదాయ, రెవెన్యూ శాఖల






భూముల రికార్డులను త్వరితగతిన క్రోడీకరించి సీఆర్డీఏకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని 'ఎస్.ఆర్. శంకరన్ వి.సి. హాల్'లో ల్యాండ్ పూలింగ్, భూముల వివరాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, రైతులకు సకాలంలో మరియు త్వరితగతిన పరిహారం అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ఇందుకోసం వివిధ శాఖల మధ్య సమాచార మార్పిడి సులభంగా వేగంగా జరగాలని సూచించారు. అమరావతి మండల అధికారులు సమన్వయంతో పనిచేసి పూర్తి వివరాలను అందజేయాలని కోరారు. ఈ పరిధిలో ఉన్న దేవాదాయ భూములు, రిజిస్టర్ అయిన మరియు కాని భూములు, జరీబ్ భూములు, చెరువులు, కాలవ పోరంబోకు తదితర భూములను క్షేత్రస్థాయిలో సర్వే చేసి, స్పష్టమైన నివేదికను సిద్ధం చేయాలన్నారు.

# అధిక వడ్డీకి ఆశపడి ఖాళీ ప్రామిసరీ నోట్ల పై సంతకాలు

## అప్పు ఇచ్చి తిరిగి అడిగితే గొడవలు..వులైతే ఎస్సి ఎస్టీ కేసు, లేకపోతే డబ్బు ఎగవేత

**చౌడేపల్లి జూన్ 10 సూర్య న్యూస్ :** మండలంలోని కొన్ని పంచాయతీలలో మహిళలు అధిక వడ్డీ ఐదురూపాయలు, పది రూపాయల కు ఆశపడి లక్షల్లో అప్పులిచ్చి, మోసపోయిన సందర్భాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. అంతే కాకుండా అధిక వడ్డీకి నగదు తీసుకొనే వారు ఖాళీ ప్రామిసరీ నోట్లపైన సంతకాలు చేయించుకొని డబ్బులు అప్పుగా ఇస్తున్నారు. ఈ క్రమంలో గత పరికిదొన, నూనెముద్దల పల్లి, సింగిరి గుంట, వెంఉడంకరారం, దొనవల్లి, చౌడగానివల్లి, చారాల, దుర్గసముద్రం, పెద్దకొండామర్రి, కాగతి, యల్లంపల్లి, కాటిపేరి, పుదిపట్ల, లద్దిగం, ఆమినిగుంట, చౌడేపల్లి వంటి గ్రామాలలో పదిహేను రోజులకు వడ్డి కూడా చెల్లించాలి. ఈ విధంగా వడ్డీ వ్యాపారంతో అధిక వడ్డీ చెల్లించలేక ఎందరో తమ విలువైన భూములు, ఆభరణాలు వదులుకుంటున్నారు. చాలా గ్రామాలలో ఖాళీ పత్రాలు దర్శనమిస్తున్నాయి. ఈ నేపత్యంలో గత రెండురోజుల క్రితం కూడా రెండు వర్గాలు కొట్టుకున్న దాఖలా కూడా ఉంది. వారిని మా ప్రతినిధి విచారించగా దిమ్మతిరిగే నిజాలు భయటపడ్డాయి. నూటికి





పదిహేను రోజులకు ఐదురూపాలు వడ్డి, ప్రతి పదిహేను రోజులకు ఖచ్చితంగా చెల్లించాల్సిందే, అలా కాకపోతే ఇండ్లు, పొలాలు, వాహనాలు లాక్కుంటారు. అంతే కాకుండా ఇటువంటి వడ్డీ వ్యాపారులకు అప్పనంగా డబ్బులు వస్తాయి కాబట్టి వారు రౌడీషీటర్లను, రాజకీయ నాయకులను బాగా మేపుతున్నారు. వాళ్ళకు వడ్డీ లేకుండా పైకము ఇచ్చి వసూళ్ళకోసం వీళ్ళ పలుకుబడిని ఉపయోగించు కుంటున్నారు. మండలం లో ఒకే కుటుంబం సుమారు ఎబ్బైలక్షలు అప్పులు ఇచ్చినది అంటే వారికి ఆదాయం ఎలా ఉందో ఆలోచించండి. ఆదాయపు పన్ను అధికారులు ఇటువంటి వాళ్ళ ఇళ్ళలో ఎఃదకు సోదాలు చేయడంలేదు. వాళ్ళ బంధువులు, నమ్మకస్తులు, ఇండ్లలో, వారి ఫోన్ కాల్ డేటా కల్గిన వారి ఇండ్లలో ఒక్కసారిగా సోదాలు నిర్వహిస్తే ఎఃతమఃది బయటపడుతారోకాబట్టి ఇటువంటి వారికి లైసెన్స్ కూడా ఉండదు. ఇటువంటి వారిపైన అధికారులు సోదాలు నిర్వాహించాలని పలువురు అభిప్రాయం తెలియజేస్తున్నారు.

### ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి

## దరఖాస్తుల ఆహ్వానం

**యాడికి జూన్ 10 సూర్య న్యూస్:** మండలంలోని ఆదర్శ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి మిగులు సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నీల ఉష తెలిపారు. జూన్ 10 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. జూన్ 24న ప్రవేశ పరీక్ష నిర్వహించి, 25న ఎంపిక జాబితాను ప్రకటిస్తామని, 26న ప్రవేశ ప్రక్రియ చేపడతామని తెలిపారు. అర్హులైన విద్యార్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.




## డాక్టర్ గోపిరెడ్డికి ఘన సన్మానం

**నరసరావుపేట జూన్ 10 సూర్య న్యూస్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని వైసీపీ నూతన టౌన్ ఉపాధ్యక్షుడు గాలం కోటేశ్వరరావు ఘనంగా సన్మానించారు. స్థానిక వైసీపీ పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గోపిరెడ్డికి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, 9వ వార్డు నాయకులు పాల్గొన్నారు.



### వేముల ఎంపీడీఓగా...

## శారదమ్మ బాధ్యతలు

**పదోన్నతితో బాధ్యతలు చేపట్టిన నూతన ఎంపీడీఓ**

**పారదర్శక పాలన,వేగవంతమైన సేవలే లక్ష్యం - శారదమ్మ**

**వేముల జూన్ 10 సూర్య న్యూస్:** వేముల మండల నూతన ఎంపీడీఓగా ఎం. శారదమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.పులివెందుల ఎంపీడీఓ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓగా సమర్థవంతంగా విధులు నిర్వహించిన ఆమెకు పదోన్నతి లభించడంతో వేముల మండల ఎంపీడీఓగా ప్రభుత్వం నియమించింది. బుధవారం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్న శారదమ్మ బాధ్యతలు చేపట్టగా అధికారులు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శారదమ్మ మాట్లాడుతూ మండల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ప్రజలకు పారదర్శకమైన, జాప్యం లేని సేవలు అందేలా కార్యాచరణ చేపడతామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల సమన్వయంతో వేముల మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.మండల ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటూ బాధ్యతాయుత పరిపాలన అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.



## టీటీడీకి రూ.10 లక్షల విరాళం

**తిరుమల జూన్ 10 సూర్య న్యూస్:** హైదరాబాద్‌కు చెందిన భక్తుడు మన్నెం వెంకట శ్రీకాంత్ బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విరాళం డీడీని టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడుకు అందించారు. భక్తుల సహకారంతో అన్నప్రసాదం కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగుతున్నాయని టీటీడీ అధికారులు తెలిపారు. మన్నెం వెంకట శ్రీకాంత్ చేసిన విరాళాన్ని వారు అభినందించారు.



### జూన్ 12 నుండి పాఠశాలలు...

## పునః ప్రారంభం

**బలిజిపేట ఎంఈఓ 1 సామల సింహాచలం**

**పార్వతీపురం మన్యం జూన్ 10 సూర్య న్యూస్ :** వేసవి సెలవులు అనంతరం జూన్ 12 నుండి పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్నట్లు బలిజిపేట ఎంఈఓ 1 సామల సింహాచలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జూన్ 15 న స్కూల్స్ రీ ఓపెనింగ్ అని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న న్యూస్ తెలంగాణా రాష్ట్రానికి సంబంధించినదని స్పష్టం చేసారు. కనుక ఈ విషయాన్ని ఉపాధ్యాయులందరూ గమనించి, శుక్రవారం రీ ఓపెనింగ్ అయ్యే నాటికి పాఠశాలలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు , త్రాగునీరు, టాయిలెట్స్ తదితర సౌకర్యాలు సక్రమంగా ఉండేలా ప్రధానోపాధ్యాయులు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.



## కుప్పం ఆర్డీవోగా షేక్ మహమ్మద్ హుస్సేన్

**కుప్పం జూన్ 10 సూర్య న్యూస్:** కుప్పం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా షేక్ మహమ్మద్ హుస్సేన్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన ప్రకాశం జిల్లాలో తహసీల్దార్‌గా సేవలందించారు.బదిలీపై కుప్పంకు వచ్చిన ఆయన బుధవారం ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టగా, ఇంతవరకు ఇన్‌చార్జ్ ఆర్డీవోగా పనిచేసిన విజయలక్ష్మి చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా షేక్ మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ప్రజలకు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేస్తానన్నారు.



### ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మూడు మండలాల

# ఎంఈఓలకు వినతిపత్రం అందజేత

**శ్రీకాళహస్తి జూన్ 10 సూర్య న్యూస్:** ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాలలో మౌలిక సదుపాయాలపై శ్రీకాళహస్తి మండలం ఎంఈఓ బాలయ్య , బుచ్చినాయుడు కండ్రిగ మండలం ఎంఈఓ కె. రవీంద్ర నాయుడు , కె.వి.పురం మండలం ఎంఈఓ ఆర్. రవికుమార్ కి సిఎంఓ జి. సురేష్ కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కోగిలి. మునిచందు, ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలను ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యే నాటికి తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్యాన్లు, బెంచీలు, పరిశుభ్రమైన తరగతి గదులు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత కారణంగా విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.



## పి.కోటకొండలో తాగునీటి సమస్యకు పరిష్కారం

**వైకుంఠం జ్యోతి ఆదేశాలతో సమస్య పరిష్కారం**

**మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన గ్రామస్తులు**

**దేవనకొండ జూన్ 10 సూర్య న్యూస్:** మండల పరిధిలోని పి.కోటకొండ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు ఆలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లెపల్లి రంగడు గ్రామంలోని మూడు బోర్లకు మోటార్లు బిగించి నీటి సరఫరా పునరుద్ధరించారు. ఈ చర్యలతో గ్రామంలో చాలా వరకు తాగునీటి సమస్య తీరనుందని స్థానికులు తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వైకుంఠం జ్యోతి, మల్లెపల్లి రంగడుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించిన పంచాయతీ కార్యదర్శికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.




### ధర్తీ మాతా అభియాన్ ప్రోగ్రాంలో సర్పంచులకు

## భూసార పరిరక్షణ, ఎరువుల వాడకంపై అవగాహన

**మహబూబాబాద్ జూన్ 10 సూర్య న్యూస్:** బయ్యారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండల వ్యవసాయ అధికారి కే.రాజు ఆధ్వర్యంలో ధర్తి మాతా బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ స్థాయిలో నిగ్రాణి సమితుల ప్రాముఖ్యత గురించి సమావేశం అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని గ్రామ పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో భూసార పరిరక్షణ, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, సమగ్ర ఎరువుల యాజమాన్య విధానాలను ప్రోత్సహించడం, నకిలీ విత్తనాల బారిన పడకుండా రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు,పంట అవశేషాల దహనం వల్ల కలిగే నష్టాలు,పంటల వైవిధ్యీకరణ యొక్క ప్రాముఖ్యత,రానున్న వర్షాకాలంలో వ్యవసాయ సీజన్‌కు రైతులు ముందస్తుగా చేపట్టవలసిన చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.వ్యవసాయ భూముల ఆరోగ్యాన్ని కాపాడుతూ,సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా దిగుబడులు పెంపొందించుకోవచ్చని రైతులకు సూచించారు.అలాగే నకిలీ విత్తనాలు, అనధికార విక్రయదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని,లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలు , ఎరువులు,పురుగు మందులు కొనుగోలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి కిరణ్, డిఆర్వో రవి, సర్పంచులు, ఏఈవోలు, అటవీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




### తాగునీటి ఎద్దడి లోతుపాలెంలో

## మొరాయిస్తున్న చేతిపంపులు

**పట్టించుకోని అధికారులు..!**

**దేవీపట్నం జూన్ 10 సూర్య న్యూస్:** మండలం లోని ఇందుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని లోతుపాలెం గ్రామంలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. గ్రామంలో పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన చేతిపంపులు గత కొంతకాలంగా మూలన పడటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామస్తుల సమాచారం ప్రకారం.. లోతుపాలెం గ్రామంలో మొత్తం 7 చేతిపంపులు ఉన్నాయి. అయితే ప్రస్తుతం వీటిలో చాలా వరకు పంపులు పూర్తిగా చెడిపోయాయి. కనీసం ఒక్క పంపు నుండి కూడా చుక్క నీరు వచ్చే పరిస్థితి లేకపోవడంతో, తీవ్రమైన ఎండల తీవ్రతకు తోడు తాగునీటి కోసం గ్రామస్తులు రోజువారీగా తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై స్థానిక అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో తాగునీరు లేకపోవడంతో కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని, కొన్నిసార్లు తప్పనిసరి పరిస్థితుల్లో కలుషిత నీటిని వాడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. దీనివల్ల సీజనల్ వ్యాధులు, జబ్బులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలి అని తాగునీరు అనేది కనీస ప్రాథమిక అవసరమని అధికారులు వెంటనే స్పందించి గ్రామానికి ప్లంబర్ లేదా మెకానిక్‌ను పంపించాలని లోతుపాలెం గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. చెడిపోయిన 7 చేతిబోర్లకు తక్షణమే మరమ్మతులు చేయించి, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలని వారు డిమాండ్ చేస్తున్నారు.




### ఈనెల 12 నుండి పాఠశాలలు

## పునః ప్రారంభం

**సీతారామపురం జూన్ 10 సూర్య న్యూస్:** వేసవి సెలవుల అనంతరం ఈనెల 12వ తేదీ నుంచి అన్ని పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయని ఎంఈఓ మస్తాన్ వలి బుధవారం తెలిపారు. ఉపాధ్యాయులందరూ పాఠశాల విధులకు హాజరు కావాలన్నారు. 11వ తేదీ నాటికి పాఠశాల పరిసరాలను, తరగతి గదులను పరిశుభ్రంగా ఉండేటట్లుగా,త్రాగునీరు, వాడుక నీరు విద్యార్థులకు అందుబాటులో ఉండేటట్లుగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు.పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థినీ విద్యార్థులను పండగ వాతావరణం లో ఆహ్వానించేటట్లుగా చర్యలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులతో, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థుల నమోదు పెంపొందే విధంగా కృషి చేయాలన్నారు.

# దమ్ము లేని సోమిరెడ్డి సవాల్ చేసి పారిపోవడం ఎందుకు-కాకాణి

**నెల్లూరు జూన్ 10సూర్య న్యూస్:** ఆంధ్రరాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా? ముఖ్యమంత్రి ఉన్నాడా? అనే అనుమానం కలుగుతోందని, ఎక్కడ చూసినా అవినీతి, అరాచకాలు రాజ్యమేలుతున్నాయని ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి “డా” కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లోని కోవెరపాలెం, పంటపాలెం, ఈదర్లవారిపాలెం, వరిగొండ గ్రామాల్లో పర్యటించిన ఆయన ఇటీవల మృతి చెందిన పార్టీ శ్రేణులు, స్థానిక పెద్దల కుటుంబాలను పరామర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, ప్రజలను ఏ విధంగా నమ్మించి వెన్నుపోటు పొడిచారో వివరించడానికి గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా ‘వెన్నుపోటుకు రెండేళ్లు’ పేరిట నిరసన ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నామని, జూన్ 12న అన్ని నియోజకవర్గాల్లో భారీ ర్యాలీలు చేపడతామని ప్రకటించారు. పొదలకూరు మండల అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని స్వయంగా సవాల్ విసిరిన టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.. తాను సర్వేపల్లి నియోజకవర్గవ్యాప్తంగా మీడియా సమక్షంలో ప్రజల మధ్య చర్చకు సిద్ధమని ప్రకటించగానే తోకముడిచి పత్తా లేకుండా పారిపోయాడని, ఇప్పటికైనా తన చెంచాలను పంపకుండా సమయం, తేదీ చెబితే ఎక్కడైనా చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. వైఎస్సార్సీపీ హయాంలో జగన్మోహన్ రెడ్డి గారి ముఖ్యమంత్రిత్వంలో నారాయణరెడ్డిపేట నుండి తోటపల్లిగూడూరు వరకు, అలాగే పేడూరు, ఇసుకపాలెం గ్రామాలకు శాశ్వత సిమెంట్ రోడ్లు, డ్రైన్లు వేయించామని, పేదలకు ఖరీదైన ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించామని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని, డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేసిందని, పెన్షన్లు ఇస్తామని చెప్పి రెండేళ్లు దాటినా కొత్త పెన్షన్లు ఇవ్వలేదని, పైగా రైతులు రెండో పంటకు యూరియా అందక ఇబ్బందులు పడుతుంటే యాప్‌ల పేరుతో ఎకరాకు రెండు బస్తాలే ఇస్తామంటూ రైతులను నానా అవస్థలు పెడుతోందని మండిపడ్డారు. రైతులందరికీ సరిపడా యూరియా తక్షణమే అందించాలని డిమాండ్ చేస్తూ, తాము అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా నిరంతరం ప్రజల పక్షాన నిలిచి పోరాడుతామని కాకాణి గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.




సూర్య

గురువారం 11 జూన్, 2026

### మన ఊరు - మన వేంపల్లి నినాదంతో ప్రతి ఒక్కరూ...

# అభివృద్ధికి సహకరించాలి

**మండల టీడీపీ కన్వీనర్ సింగారెడ్డి రామమునిరెడ్డి**

**వేంపల్లె జూన్ 10 సూర్య న్యూస్ :** వేంపల్లె పంచాయతీని ప్లాస్టిక్ రహిత పంచాయతీగా మార్చేందుకు సహకరించాలని పంచాయతీ స్పెషల్ అధికారి వెంకట సుబ్బయ్య, పంచాయతీ ఇన్ ఛార్జ్ ఈఓ రమణయ్య ను మండల టీడీపీ కన్వీనర్ సింగారెడ్డి రామమునిరెడ్డి కోరారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో టిడిపి నేతలతో కలిసి ప్లాస్టిక్ నిర్మూలనపై స్పెషల్ అధికారి వెంకట సుబ్బయ్య, పంచాయతీ ఇన్ చార్జ్ ఈఓ రమణయ్య లతో చర్చించారు. ప్లాస్టిక్ కవర్లు నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు దుకాణాదారులకు నోటిసుకు కూడ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జూలై 1 నుండి దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు విక్రయాలు చేస్తే అలాంటి దుకాణాల యాజమానులపై జరిమానాలు విధించి చర్యలు తీసుకొంటామని తెలిపారు. కాబట్టి ప్రతి దుకాణాదారుడు అధికారులకు సహకరించాలని కోరారు. టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, మాట్లాడుతూ మన ఊరు మన వేంపల్లి అనే నినాదంతో ప్రతి ఒక్కరూ వేంపల్లి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి ఉపాధ్యక్షుడు వీరభద్ర, మొండోండ్ గౌస్, నామ వేమకుమార్ బిజెపి నాయకుడు గాలి హరి ప్రసాద్ తో పాటు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



### ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యకు

# ఘన నివాళి

**గోకవరంలో రామసేన బీజేపీ నాయకుల వర్ధంతి నిర్వహణ**

**తూర్పుగోదావరి/ గోకవరంజూన్ 10 సూర్య న్యూస్:** స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వర్ధంతిని గోకవరంలో బుధవారం ఘనంగా



నిర్వహించారు. గోకవరం--తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గ బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది కలిసి గోపాలకృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చీరాల--పేరాల ఉద్యమం ద్వారా బ్రిటిష్ పాలకులను గడగడలాడించిన మహానేతగా దుగ్గిరాల గోపాలకృష్ణయ్య చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. తెలుగు జానపద కళారూపాల పరిరక్షణ, గ్రంథాలయాల విస్తరణకు ఆయన విశేష కృషి చేశారని తెలిపారు. దేశవ్యాప్తంగా పర్యటిస్తూ బ్రిటిష్ అరాచక పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కల్పించారని కొనియాడారు. కార్యక్రమంలో బత్తుల నానాజీ, మంగరాతి పెద్దరాజు, తుమ్మల బుజ్జి, పదిలం చక్రారావు, మండల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ ఆదం మణికంఠ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### దేశాభివృద్ధికి నాయకత్వం ప్రశంసించిన

# బీజేపీ నేతలు

**గోకవరం రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు**

**తూర్పుగోదావరి /గోకవరంజూన్ 10 సూర్య న్యూస్:** ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై శక్తివంతమైన దేశంగా ఎదిగిందని బీజేపీ



నాయకులు పేర్కొన్నారు. ప్రధాని మోదీ అధికా రంలోకి వచ్చి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గోకవరంలోని పురాతన పర్వతవర్ధని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో బీజేపీ నాయకులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాని మోదీకి ఆయురారోగ్యాలు, మరింత శక్తి సామర్థ్యాలు ప్రసాదించాలని పరమేశ్వరుణ్ని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఏపీ గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా మంగరాజు, మండల బీజేపీ అధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర, సీనియర్ నాయకుడు ఉంగరాల ఆదివిష్ణు మాట్లాడుతూ సాధారణ కార్యకర్త స్థాయి నుంచి దేశ ప్రధానమంత్రి పదవికి ఎదిగి, వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నాయకుడిగా మోదీ ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. దేశాభివృద్ధి, సంక్షోభాల నిర్వహణ, జాతీయ భద్రత విషయంలో ఆయన తీసుకున్న చర్యలను కొనియాడారు. దేశ రక్షణ, అభివృద్ధి, ప్రజా సంక్షేమ రంగాల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వల్ల భారత్ అంతర్జాతీయంగా మరింత బలోపేతమైందని పేర్కొన్నారు. దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే ప్రధాని మోదీ నాయకత్వం కొనసాగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సత్తి వెంకటరెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు బత్తుల వెంకన్నబాబు, మండల ప్రధాన కార్యదర్శి ముప్పిడి నాగేశ్వరరావు, కోశాధికారి ముమ్మిడివరపు రామకృష్ణ, మామిడి వీరవెంకట సత్యనారాయణ, కామిశెట్టి నాగేశ్వరరావు, కుసుమంచి నాగేశ్వరరావు, పిల్లంగోరు పాపారావు, ఏగి సాంబశివ, ఏగి దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

# మర్రిపాడు మండలంలో సామాన్యుడికి న్యాయం శూన్యమా..?

### బడా బాబులకు రెడ్ కార్పెట్.. పేదలకు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలా..?

### ప్రభుత్వ వ్యవస్థపై పెరుగుతున్న అసంతృప్తి.. అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

**మర్రిపాడు జూన్ 10 సూర్య న్యూస్ :** చట్టం అందరికీ ఒకటే" అని రాజ్యాంగం చెబుతోంది. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవ చేయడానికే అని అధికారులు చెబుతున్నారు. కానీ మర్రిపాడు మండలంలో సామాన్య ప్రజల అనుభవాలు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల గడప తొక్కిన సామాన్యుడికి నెలల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదని, అదే సమయంలో పలుకుబడి ఉన్నవారికి మాత్రం పనులు వేగంగా పూర్తవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. భూ సమస్యలు, ఆదాయ-కుల ధ్రువీకరణ పత్రాలు, వారసత్వ హక్కులు, ఫిర్యాదుల పరిష్కారం, కేసుల నమోదు వంటి అనేక అంశాల్లో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. దరఖాస్తులు ఇచ్చి వారాలు, నెలలు గడిచినా స్పందన రాకపోవడం, ఒక టేబుల్ నుంచి మరో టేబుల్‌కు తిప్పడం, చిన్న చిన్న కారణాలతో ఫైళ్లను పెండింగ్‌లో పెట్టడం సాధారణంగా మారిపోయిందని ఆరోపిస్తున్నారు. పేదవాడి దరఖాస్తు ఫైల్‌పై దుమ్ము పేరుకుపోతుంది..కానీ పలుకుబడి ఉన్న వ్యక్తి ఫైల్ మాత్రం గంటల్లో కదులుతుంది అని కొందరు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవస్థలో సమానత్వం కనిపించడం లేదని, కొందరికి ప్రత్యేక మర్యాదలు, మరికొందరికి నిర్లక్ష్యం అనే భావన పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్ శాఖల పనితీరుపై ఎక్కువ విమర్శలు వినిపిస్తున్నాయి. భూ వివాదాలు, సర్టిఫికెట్ల జారీ, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు వంటి అంశాల్లో ప్రజలు తీవ్ర




అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారుల గదుల ముందు గంటల తరబడి వేచి ఉన్నా స్పందన లభించకపోవడం, పలుమార్లు తిరిగినా ఫలితం కనిపించకపోవడం వల్ల ప్రజల్లో విసుగు పెరుగుతోందని సమాచారం. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజాసేవా కేంద్రాలుగా ఉండాల్సింది పోయి, సామాన్యుడికి అందని కోటలుగా మారిపోతున్నాయా అన్న ప్రశ్నలు ఇప్పుడు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అధికారుల సమయం విలువైనదే..మరి ప్రజల సమయానికి విలువ లేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒక దరఖాస్తు స్థితి తెలుసుకోవడానికి కూడా పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. స్థానిక మేధావుల అభిప్రాయం ప్రకారం, ప్రజల్లో పెరుగుతున్న ఈ అసంతృప్తిని తేలికగా తీసుకోవద్దని అంటున్నారు. ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటే ప్రజాస్వామ్య వ్యవస్థకే నష్టం జరుగుతుందని హెచ్చరిస్తున్నారు. ప్రతి దరఖాస్తుకు ఆన్‌లైన్ ట్రాకింగ్, నిర్దిష్ట గడువులో పరిష్కారం అధికారుల జవాబుదారీతనం, ఉన్నతాధికారుల ఆకస్మిక తనిఖీలు వంటి చర్యలు అవసరమని సూచిస్తున్నారు.

**ప్రస్తుతం మర్రిపాడులో వినిపిస్తున్న ప్రధాన ప్రశ్న ఒక్కటే...**
ప్రభుత్వ కార్యాలయాలు నిజంగా ప్రజల కోసమే పనిచేస్తున్నాయా... లేక కొందరికే ప్రత్యేకంగా అందుబాటులో ఉన్నాయా? ఈ ప్రశ్నకు సంబంధిత శాఖల అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. సామాన్యుడికి న్యాయం వేగంగా అందే విధంగా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని, ప్రభుత్వ కార్యాలయాలపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులారా... పలుకుబడి కాదు, పౌరుడిని చూడండి. కులం కాదు, చట్టాన్ని చూడండి. పరిచయం కాదు, న్యాయాన్ని అమలు చేయండి" అని మర్రిపాడు ప్రజలు కోరుతున్నారు.

### ఎల్ఎల్ఎంలో గోల్డ్ మెడల్ సాధించిన

## ప్రసన్నకు పలువురు శుభాకాంక్షలు

**నెల్లూరు జూన్ 10 సూర్య న్యూస్:** శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతిలో జరిగిన 63 నుంచి 68వ స్నాత కోస్తావవశీలో భాగంగా జూన్ 10వ తారీఖున బుధవారం ఎస్ వి యూనివర్సిటీ శ్రీ వెంకటేశ్వర ఆడిటోరియంలో జరిగిన పై కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్. నజీర్, ఉపకులపతి ఆచార్య తాత. నర్సింగ్ రావు, భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్ర సలహాదారు ఆచార్య. అజయ్ కుమార్ సూద్, అధ్యక్షులు భారత జాతీయ విజ్ఞాన అకాడమీ సి.ఎస్.వి.ఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ శేఖర్.సి.మండే, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ.ఎం.ఎల్ల తదితరులు పాల్గొని వివిధ డిపార్టుమెంట లలో యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మెరిట్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ మరియు ప్రైస్ లను అందించడం జరిగినది..అలాగే నెల్లూరు నగరం లోని మూలపేటకు చెందిన దేవి ప్రసన్నకు ఎల్ఎల్ఎం నందు గోల్డ్ మెడల్ ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందుకోవడం జరిగినది. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు, బంధుమిత్రులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.



### ఏపీ ఎంపీల్లో మైనారిటీలకు

## స్థానంలేకపోవడం శోచనీయం!!

**కాకినాడ, జూన్ 10 సూర్య న్యూస్:** ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్ సభ రాజ్యసభ సభ్యుల్లో మైనారిటీ వర్గాలు లేకపోవడం శోచనీయమని పౌర సంక్షేమ సంఘం పేర్కొంది. ఏపీ లోక్‌సభలో 25,రాజ్యసభ లో11 స్థానాలు ఉండగా వాటిల్లో ముస్లిం క్రిస్టియన్ సిక్కు వంటి మైనారిటీ సభ్యులు లేరన్నారు. రాష్ట్రంలో 9శాతం పైగా ముస్లిం,2శాతం మేర క్రిస్టియన్లు ఉన్నా గత కొన్ని ఎన్నికలుగా మైనారిటీ లకు లోక్ సభ రాజ్యసభ లోకి ప్రవేశం ఉండడం లేదన్నారు. రిజర్వ్ సీట్లు కల్పించాల్సిన అవసరం వుందన్నారు. భవిష్యత్ రాజ్యసభలో మైనార్టీలకు ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై వుందన్నారు. భారత జనాభాలో 14శాతం ముస్లింలు ఉంటే లోక్ సభ స్థానాల్లో 4.4 శాతానికి పరిమితం కావడం తగదన్నారు.



# ఏకపక్ష వైఖరిలో కావలి పోలీసులు..?

### మండిపడుతున్న వైసీపీ నేతలు..మాజీ ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా కదలని వైనం..!

### చోటా నేతల కనుసన్నల్లో ఖాకీలు..సామాన్యుడికి రక్షణ ఎక్కడంటూ పట్టణంలో గుసగుసలు..!

### జిల్లా ఎస్పీ మేడం కావలి పై దృష్టి పెట్టాలని పలువురు విజ్ఞప్తులు

**నెల్లూరు /కావలి జూన్ 10 సూర్య న్యూస్:** జిల్లా లోని కావలి నియోజకవర్గంలో పోలీస్ యంత్రాంగం అధికార కూటమి



పార్టీకి తొత్తులుగా మారి ఏకపక్షంగా వ్యవహరిస్తోందంటూ స్థానిక ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ముక్కున వేలేసుకుం టున్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసి, 20 ఏళ్ల పాటు రాజకీయాల్లో ఉన్న ఉన్నత స్థాయి నేత, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినా, వ్యక్తిత్వ హననానికి పాల్పడినా పోలీసులు కనీస చర్యలు తీసుకోకపోవడం పట్టణంలో ఇప్పు డు హాట్ టాపిక్‌గా మారింది. అదే సమయంలో అధికార పార్టీ నేతలు చిన్న మాట చెబితే చాలు.. ఎటువంటి విచారణ లేకుండా నమోదు చేస్తూ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఎస్పీ హోదా లో ఉన్న ముగ్గురు పోలీసులు ఆదిపరాశక్తులు ఉన్నప్పటికీ కావలి ని కంట్రోల్ చేయడంలో విఫలమయ్యారట..

**జోహార్ రఘు అన్నా అంటూ వికృత చేష్టలు:-**
ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అనుచరులుగా చెప్పుకునే కొంతమంది సోషల్ మీడియా పేటియం బ్యాచ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రఘు చనిపోయాడంటూ "జోహార్ రఘు అన్నా" అని ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టడం తీవ్ర కలకలం రేపింది. ఈ వికృత చేష్టల వల్ల రఘు కుటుంబంలో తీవ్ర అలజడి రేగడమే కాకుండా ఆయన మనోవేదనకు గురయ్యారు. దీనిపై బిట్రగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా నేటికీ ఎలాంటి దిశూ-దిక్కూ లేదు. మరోవైపు దగదర్తి మండలంలో వెలినేని మహేష్ నాయుడు ఆధ్వర్యంలో తమ అభిమాన నాయకుడిని కించపరుస్తూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులపై నిన్న సాయంత్రం దగదర్తి పోలీస్ స్టేషన్‌లో




ఫిర్యాదు చేశారు. తన అభిమాన నాయకుడి గురించి అసత్య ప్రచారాలు చూసి వందలాది మంది ఫోన్ చేసి అడుగుతుంటే




మనోభావాలు దెబ్బతిన్నాయని మహేష్ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.

**విజిలెన్స్ సిఐ ఫిర్యాదుకే దిక్కులేదు..!**
పోలీస్ వ్యవస్థ ఎంతలా దిగజారిపోయిందంటే.. స్వయానా తమ శాఖకు చెందిన విజిలెన్స్ సిఐ పైనే దాడి చేసి, విధులకు ఆటంకం కలిగిస్తూ దురుసుగా ప్రవర్తించారని అధికార పార్టీకి చెందిన వలస చోటా నేతలపై సదరు సిఐ ఫిర్యాదు చేస్తేనే ఇంతవరకు దిక్కులేదు. కూటమి ఎమ్మెల్యే అండ చూసుకుని వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వలస చోటా నేతల కబంధహస్తాల్లో పోలీస్ వ్యవస్థ చిక్కుకుపోయిందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

**వన్ టౌన్ ఎస్ఐకి ఫిర్యాదు.. చర్యలు తీసుకోకుంటే సత్తా చూపిస్తాం..!**




మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిపై మార్ఫింగ్ ఫోటోలు పెడుతూదుర్భాషలాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కావలి పట్టణ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు కలిసి.. టిడిపి నేతలు నేతలు అయినటువంటి దేవరకొండ శీను, దావులూరి దేవకుమార్, గుత్తికొండ కిషోర్, చవలా రామకృష్ణ, జ్యోతి బాబురావు అప్పల కళ్యాణ్ చక్రవర్తి, సీఎండీ న్యూస్ చైర్మన్ మధు చిలక పార్టీ మనోహర్ చిలకపాటి, మధు కిషోర్,తోకల శీను, హరీష్ గొర్రెపాటి, అను పేర్లు గల వ్యక్తులపై ఎస్ఐ సుమన్‌కు ఫిర్యాదు అందించారు. పోలీసులు తక్షణమే స్పందించి నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోతే, వైఎస్సార్‌సీపీ తరఫున తమ సత్తా ఏంటో చూపిస్తామని ఖాకీలను హెచ్చరించారు.

**2029లో అధికారం మారితే పరిస్థితి ఏంటి..?**
నియోజకవర్గవ్యాప్తంగా టీడీపీ నేతల అరాచకాలపై వైఎస్సార్‌సీపీ ఫిర్యాదుల పర్వం కొనసాగుతోంది. ఇటీవల సీనియర్ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డి హెచ్చరించినట్లు.. ఒకవేళ 2029లో అధికారం మారితే ఇప్పుడు ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులు రేపు తమ విధులను సక్రమంగా నిర్వహించగలరా? అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ వ్యవస్థ ఏకపక్ష ధోరణి వీడి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సర్వత్రా డిమాండ్ వ్యక్తమవుతోంది.

EDITED PUBLISHED AND WONEDBY N.MAHESWARA REDDY PUBLISHED AT D.NO 1/171/2 DEVANAKONDA (M&POST) 518465, KURNOOL DIST, AP, PRINTED AT SRI LAKSHMI OFFSET PRINTERS AND PUBLICATIONS D.NO 1/171/2 DEVANAKONDA (M&POST)518465 KURNOOL DIST. CONTRACT CELL NO. 9010008143,RNI APTEL 2022/82194 Gmail :suryavelugutelugu daily@gmail.com

### ఎన్నికల జాబితాల స్వచ్ఛత,ఖచ్చితత్వం కోసం
# కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

**కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లి బాబు**

**కాకినాడ, జూన్ 10 సూర్య న్యూస్:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించబడుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ పునశ్చరణ(ఎస్ఐఆర్) -2026 కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయుటకు, కాకినాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయం నందు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ) అండ్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఎస్.మల్లి బాబు ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఆఫీసర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అండ్ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, కాకినాడ రూరల్ మరియు డిప్యూటీ తహసీల్దార్ (ఎలక్షన్స్) బిఎల్ఓలకు ఎస్ఐఆర్-2026 కార్యక్రమం యొక్క లక్ష్యాలు, విధి విధానాలు, ఇంటింటి సర్వే ప్రక్రియ, గణన ఫారమ్‌లు పంపిణీ మరియు సేకరణ, ఓటరు వివరాల ధృవీకరణ, మరణించిన మరియు వలస వెళ్లిన ఓటర్ల గుర్తింపు, కొత్త ఓటర్ల నమోదు, పోలింగ్ స్టేషన్‌ల హేతుబద్ధీకరణ తదితర అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. శిక్షణ సందర్భంగా బిఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎన్నికల జాబితాల స్వచ్ఛత మరియు ఖచ్చితత్వం కోసం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిఎల్ఓలు తమ సందేహాలను నివృత్తి చేసుకుని, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకున్నారు. ఎస్ఐఆర్-2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బిఎల్ఓల పాత్ర అత్యంత కీలకమని అధికారులు పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సంబంధిత ఎన్నికల అధికారులు, రెవెన్యూ అధికారులు మరియు బూత్ లెవల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



## నిత్య అన్నదాన పథకానికి రూ.1,01,116 విరాళం

**అన్నవరం, జూన్ 10 సూర్య న్యూస్:** కాకినాడ జిల్లా శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం నిత్య అన్నదాన పథకానికి ఉయ్యూరు వాస్తవ్యులు ఎస్. శివరామకృష్ణ, శ్రీపతి మాధవి దంపతులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. బుధవారం నాడు ఈ విరాళాన్ని దేవస్థానం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసరావుకు అందజేసి, జూన్ 19వ తేదీన తమ పేరున అన్నదాన కార్యక్రమం నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా ఏఈవో శ్రీనివాసరావు దాతల సేవాభావాన్ని అభినందిస్తూ, నిత్య అన్నదాన పథకానికి భక్తులు అందిస్తున్న సహకారం వల్ల వేలాది మంది భక్తులకు ప్రతిరోజూ అన్నప్రసాదం అందుతున్నదని తెలిపారు. అనంతరం స్వామివారి ఆశీర్వాదాలతో కూడిన ప్రసాదాన్ని దాతలకు అందజేశారు. దాతలు స్వామివారిపై తమకున్న భక్తి విశ్వాసాలకు గుర్తుగా ఈ విరాళాన్ని సమర్పించినట్లు తెలిపారు. దేవస్థానం అధికారులు వారి కుటుంబ సభ్యులకు స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.



### వివాహ వార్షికోత్సవ సందర్భంగా నిత్య అన్నదాన పథకానికి
# రూ.1,00,516 విరాళం

**అన్నవరం, జూన్ 10 సూర్య న్యూస్:** కాకినాడ జిల్లా శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం నిత్య అన్నదాన పథకానికి యాతపాలెం గ్రామానికి చెందిన జి. చిన్నారావు, శ్రీమతి అన్నపూర్ణ దంపతులు రూ.1,00,516 విరాళ ంగా అందజేశారు. ఈ విరా ళాన్ని దేవస్థానం అసిస్టెంట్ ఎగ్జిక్యూ టివ్ ఆఫీసర్ శ్రీనివాసరావుకు బుధవారం అందజేశారు. తమ వివాహ వార్షికో త్సవాన్ని పురస్కరించుకుని జూన్ 10వ తేదీన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించాలని దాతలు కోరారు. ఈ సందర్భంగా ఏఈవో శ్రీనివాసరావు దాతల సేవాభావాన్ని అభినందించి, నిత్య అన్నదాన పథకానికి భక్తులు అందిస్తున్న సహకారం ఎంతో ఆదర్శప్రాయమని పేర్కొన్నారు .అనంతరం స్వామివారి ఆశీస్సులతో కూడిన ప్రసాదాన్ని దాతలకు అందజేశారు. ఈ సందర్భంగా దంపతులు స్వామివారి కృపాకటాక్షాలతో తమ కుటుంబానికి శాంతి, సౌభాగ్యాలు కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు. దేవస్థానం అధికారులు దాతల దాతృత్వాన్ని కొనియాడుతూ, వారి వివాహ వార్షికోత్సవ సందర్భంగా చేపట్టిన ఈ అన్నదాన సేవ మరెందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. భక్తుల సహకారంతో నిత్య అన్నదాన పథకం విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు.



### పెదపూడి మండల పరిషత్ కార్యాలయాన్ని
# సందర్శించిన కలెక్టర్

**ఎన్ఆర్ఈజీఎస్ పనులపై వివరించిన ఎంపీడివో**

పెదపూడి, **జూన్ 10 సూర్య న్యూస్:** పెదపూడి మండలం పెదపూడిలో ఉన్న సిహెచ్‌సి వైద్యశాలను పెదపూడి స్వర్ణ పంచాయతీని మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరీంధిర ప్రసాద్.సందర్శించారు. పెదపూడి స్వర్ణ పంచాయతీ వన్ లో పంచాయతీ కార్యదర్శి నుండి సచివాలయ స్టాఫ్ వరకు వారు అందిస్తున్న సేవలు గురించి పూర్తిగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం శానిటేషన్ గురించి తెలుసుకునే పంచాయతీ కార్యదర్శి వారికి కొన్ని సూచనలు చేసి ఉన్నారు. శానిటేషన్ సిబ్బందిని ప్రతి వీధికి వెళ్లేలా షెడ్యూలు తయారు చేయమని చెప్పారు. అలాగే వెల్ఫేర్ అసిస్టెంట్ వారిని మహిళ సంరక్షక అధికారిని అగ్రి కల్చరల్ అసిస్టెంట్ వారిని సర్వేయర్ని పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ బిల్ కలెక్టర్ వాళ్ళని అన్ని శాఖల వివరాలు పూర్తిగా తెలుసుకుని వీరి పనితీరు పట్ల అభినందనలు తెలియజేశారు ఎంపీడీవో నరేంద్ర రెడ్డి జలధార పనుల గురించి ఎన్ఆర్ఈజీఎస్ పని దినములు గూర్చి కలెక్టర్‌కి వివరించారు. వీరి వెంట ఎంపీడీవో నరేందర్ రెడ్డి తాసిల్దార్ సీతాపతి రావు,డిప్యూటీ ఎంపీడీవో ఎంఎస్ఎన్ రెడ్డి,ఎంఇఓ భానుజీ,ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సత్యనారాయణ పాల్గొన్నారు.





# రూ.13.76 కోట్లతో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన

**క్రీడల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాధాన్యం...రాజమహేంద్రవరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం**

**రాజమహేంద్రవరం జూన్ 10సూర్య న్యూస్:** విద్యతో పాటు క్రీడలు కూడా దేశ అభివృద్ధికి అత్యవసరమని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. నగరంలోని వీఎల్‌పురంలో రూ.13.76 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మల్టీపర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (అరీనా-2)కు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా కార్యక్రమం ద్వారా క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు కూడా మెరుగైన అవకాశాలు కల్పించడమే లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో క్రీడా రంగం అభివృద్ధి చెందుతోందన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం క్రీడా చరిత్రలో ఇది కీలక ఘట్టమని పేర్కొన్నారు. యువతలోని ప్రతిభను వెలికితీసేలా అత్యాధునిక వసతులతో క్రీడా సముదాయాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ రాజమహేంద్రవరాన్ని సాంస్కృతిక రాజధానితో పాటు స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నా మని చెప్పారు. అరీనా-1, అరీనా-2, అరీనా-3 పూర్తయితే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఆతిథ్యం ఇచ్చే స్థాయికి నగరం చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.






### పొదలకూరు విద్యుత్ కార్యాలయంలో
# జాతీయ జెండాకు దురవస్థ

**అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం**

**పొదలకూరుజూన్ 10 సూర్య న్యూస్:** దేశ గౌరవానికి ప్రతీక అయిన జాతీయ జెండా పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న ఘటన పొదలకూరులోని సబ్ విద్యుత్ కేంద్రంలో వెలుగుచూసింది. పొదలకూరు విద్యుత్ శాఖ కార్యాలయ భవనంపై ఎగురవేస్తున్న జాతీయ జెండా పూర్తిగా చిరిగిపోయి ముక్క లుగా మారినప్పటికీ, సంబంధిత అధికారులు దానిని మార్చేందుకు చర్యలు తీసుకోక పోవడం విమర్శలకు తావిస్తోంది. పొదలకూరు సబ్ విద్యుత్ కేంద్రంలో ముగ్గురు అధికారులు (డీఈ,ఏఈ, రెవెన్యూ అధికారులు )విధులు నిర్వహిస్తున్నప్పటికీ, భవనం పై ఎగురుతున్న జాతీయ జెండా దయనీయ స్థితిలో ఉండడం గమనార్హం. గాలికి చిరిగిపోయిన జెండా ముక్కలు వేలాడుతూ కనిపిస్తున్నాయి. దేశ గౌరవానికి చిహ్నమైన జాతీయ పతాకం ఈ స్థితిలో ఉండటం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ జెండా వినియోగ నిబంధనల ప్రకారం, చిరిగిన లేదా రంగు వెలిసిన జెండాను వెంటనే తొలగించి కొత్త జెండాను ఎగురవేయాల్సి ఉంటుంది. అయితే సంబంధిత అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. "దేశభక్తి గురించి గొప్పలు చెప్పే అధికారులు, తమ కార్యాలయంపైనే జాతీయ జెండా దుస్థితిని గమనించకపోవడం బాధాకరం. వెంటనే కొత్త జెండాను ఏర్పాటు చేసి జాతీయ పతాకానికి తగిన గౌరవం కల్పించాలి" అని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చిరిగిపోయిన జాతీయ జెండాను తొలగించి, నిబంధనలకు అనుగుణంగా కొత్త జెండాను ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



### బూత్ లెవెల్ ఆఫీసర్స్‌తో బూత్ లెవెల్ ఏజెంట్లు
# సమన్వయం చేసుకోవాలి

**పెద్దాపురం ఆర్డీవో కృష్ణమూర్తి**

**సామర్లకోట జూన్ 10 సూర్య న్యూస్:** పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం నందు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ) అండ్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ పి.కృష్ణ మూర్తి బుధవారం సామర్లకోట తహసీల్దార్ వారి కార్యలయం నందు బూత్ లెవల్ ఆఫీసర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ప్రతి ఓటర్ ముఖ్యమని, ప్రతి ఓటు విలువైనదని,ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ కార్యక్రమంలో బూత్ లెవెల్ ఆఫీసర్స్ తో బూత్ లెవెల్ ఏజెంట్లు సమన్వయం చేసుకోవాలని, జూన్ 15 నుండి జూలై 14 వరకు ఎస్ఐఆర్ ప్రక్రియ జరుగుతుందని, ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ 20-25 సంవత్సరాలకు ఒక సారి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవగాహనలో దీని యందు బిఎల్ఏలు యొక్క విదులు గురించి మాస్టర్ ట్రైనీ చే బిఎల్‌వోలకు శిక్షణ మరియు బిఎల్‌వోలకు ఎస్ఐఆర్ కిట్ అందచేయడం జరిగినది. ఈ శిక్షణ కార్యక్రమంలో సామర్లకోట తహశీల్దార్ మరియు అసిస్టెంట్ ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కె.చంద్రశేఖర్ రెడ్డి,ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్, పెద్దాపురం బిఎల్‌వోల సూపర్‌వైజర్ శిక్షణ కార్యక్రమనకు హాజరయ్యారు.

### టిడ్కో కాలనీల్లో...
# పోలీసుల ఉక్కుపాదం..

**కార్డన్ సెర్చ్‌లో 41 వాహనాల స్వాధీనం**

**ఇంటింటి సోదాలు-గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన - పత్రాలు లేని 41 వాహనాల స్వాధీనం**

**ఆత్మకూరు జూన్ 09 సూర్య న్యూస్ :** ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా ఆత్మకూరు పట్టణంలోని టిడ్కో భవనాల్లో పోలీసులు సోమవారం విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. నెల్లూరు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు ఆత్మకూరు డీఎస్పీ కె. వేణుగోపాల్ పర్యవేక్షణలో సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, 30 మంది పోలీసు సిబ్బంది పాల్గొని టిడ్కో కాలనీలోని ప్రతి ఇంటిని సందర్శించారు. నివాసితుల వివరాలు సేకరించడంతో పాటు వారి గుర్తింపు పత్రాలు, వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించారు. 41 వాహనాల స్వాధీనం తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని మొత్తం 41 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 26 స్కూటర్లు, 9 ఆటోలు, 6 కార్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. సంబంధిత పత్రాలను సమర్పించిన తర్వాతే వాహనాలను విడుదల చేస్తామని పేర్కొన్నారు. గంజాయి, సైబర్ నేరాలపై హెచ్చరిక ఈ సందర్భంగా టిడ్కో వాసులను ఉద్దేశించి సీఐ గంగాధర్ మాట్లాడుతూ, గంజాయి వినియోగం, విక్రయాలు, ఇతర మాదకద్రవ్యాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, ఓటీపీలు, బ్యాంకు వివరాలు, లింకుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. మోసపూరిత కాల్స్ లేదా సందేశాలు వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ కాలనీల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తుల సంచారం, మాదకద్రవ్యాల విక్రయాలు, జూదం, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని తెలిపారు. భద్రతే లక్ష్యంపోలీసులు నిర్వహిస్తున్న కార్డన్ సెర్చ్‌లు ప్రజలను ఇబ్బంది పెట్టడానికి కాదని, వారి భద్రత కోసం చేపడుతున్న చర్యలని అధికారులు స్పష్టం చేశారు. టిడ్కో కాలనీల్లో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయడం, నేరాలకు అడ్డుకట్ట వేయడం, యువతను చెడు వ్యసనాల నుంచి దూరంగా ఉంచడమే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలను గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. సురక్షిత సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి అని పోలీసులు పిలుపునిచ్చారు.

## రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ

**రాజమహేంద్రవరం,జూన్ 10 సూర్య న్యూస్:** మహిళల ఆర్థిక పరిపుష్టికి కుట్టు శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని పెదిరెడ్డి శ్వేత ముత్యం అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో స్థానిక ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో మహిళలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ కార్యక్రమంను బుధవారం శ్వేత ముత్యం ప్రారంభించి మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాదికి మహిళల నైపుణ్యా భివృద్ధికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. అంతర్జాతీయంగా మానవత్వంతో రెడ్ క్రాస్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ రమణ,కోశాధికారి డాక్టర్ జి మహాలక్ష్మి,ఎమ్సీ సభ్యులు బళ్ళా శ్రీనివాసరావు, డాక్టర్ జె సురేష్, బోను రామకృష్ణ,డాక్టర్ నూర్ బేగ్,ఏఆర్ జీహెచ్ ఎమ్సీ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్ శివమణి,ఫ్యాషన్ డిజైనింగ్ ట్రైనర్ ఎమ్ అరుణశ్రీ,డీఎఫ్ఓ గోపీకృష్ణ, పద్మ,భావనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జ్యూస్, రోజ్‌మిల్క్ దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు

**నాణ్యతపై అనుమానాలతో ఆహార నమూనాల సేకరణ**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.. అధికారులు ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యమని స్పష్టం**

**రాజమహేంద్రవరం జూన్ 10 సూర్య న్యూస్:** ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా నగరంలోని పలు జ్యూస్, రోజ్‌మిల్క్, టీ దుకాణాల్లో ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విక్రయిస్తున్న ఆహార, పానీయాల నాణ్యత, తయారీ విధానాలు, నిల్వ పరిస్థితులు, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ కె. సుప్రియ, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌కుమార్ సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో కొన్ని దుకాణాల్లో వినియోగిస్తున్న పదార్థాల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమైనట్లు తెలిపారు. ముఖ్యంగా ఫ్రూట్ జ్యూస్‌లు, రోజ్‌మిల్క్ తయారీలో ఉపయోగిస్తున్న కొన్ని పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలకు పంపినట్లు వెల్లడించారు. పరీక్షల నివేదికలు వచ్చిన తర్వాత నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత నిర్వాహకులపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఆహార వ్యాపారులు పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, వినియోగదారులు అనుమానాస్పద ఆహార పదార్థాల విక్రయాలపై ఫుడ్ సేఫ్టీ శాఖకు ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లాలో ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.





సూర్య జాతీయ తెలుగు దినపత్రిక

గురువారం 11 జూన్, 2026

# 12 ఏళ్ల సుపరిపాలనకు ప్రతీక ప్రధాని నరేంద్ర మోడీ

**అరుదైన రికార్డు సాధించిన ప్రధాని మోడీ కి బీజేపీ నేతల అభినందనలు...బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. సుష్మ**

**వేంపల్లె జూన్ 10సూర్య న్యూస్ :** మొట్ట మొదటి సారిగ మన భారత దేశానికి ప్రధానమంత్రిగా వరుసగా 4399 రోజులు పని చేసి ఘనత సాధించిన ప్రధాని నరేంద్రమోడీ చరిత్రలోకి ఎక్కారని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెడబల్లి సుష్మ పేర్కొన్నారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, అభివృద్ధి మరియు సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ 12 సంవత్సరాల విజయవంతమైన పాలనను పూర్తి చేసుకోవడం ఒక విశిష్టమైన మైలురాయి అని తెలిపారు. పెద్ద నోట్ల రద్దు (డీమోనిటైజేషన్) మొదలుకుని జీఎస్టీ అమలుతో రాష్ట్రాల ఆదాయాన్ని పెంచడం కానీ, కోవిడ్–19 మహమ్మారి నుంచి మన దేశాన్ని రక్షించడమే కాకుండా వేరే దేశాలకి మనమే కోవిడ్ టీకాను అందించి మన భారత దేశ ఔన్నత్యాన్ని పెంచడం కానీ, చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కానీ, కాశ్మీర్ విషయంలో ఆర్టికల్ 370 అయితేనేమి, ఉగ్రదాడులకు బదులుగా సర్జికల్ స్ట్రైక్స్ , ఆపరేషన్ సింధూర్ అయితేనేమి , డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ , జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, విమానాశ్రయాలు, రైల్వేలు, వందే భారత్ ట్రైన్లు, స్వచ్ఛ భారత్ మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పేదలకు గృహాలు, ఉజ్వల యోజన కింద మహిళలకు గ్యాస్, కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు సహాయం , ఆత్మ నిర్భర్ భారత్ ద్వారా రక్షణ రంగంలో ఎగుమతులు, సుకన్య సమృద్ధి యోజన ద్వారా ఆడపిల్లలకి లబ్ధి పొందేలా చేయడం, ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన ద్వారా సీనియర్ సిటిజన్స్ కి ఫ్రీ హెల్త్ ఇన్సూరెన్స్ , ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన ద్వారా పేదలకు బియ్యం, స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా ద్వారా యువతకు సబ్సిడీ లోన్స్, ముద్ర లోన్స్ ద్వారా మహిళలకు చేయూత నివ్వడం, పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన ద్వారా సోలార్ సబ్సిడీ , వెనుకబడిన కులాలకు ఉచిత సోలార్ పానెల్స్, పీఎం విశ్వకర్మ ద్వారా కుల వృత్తులకు ప్రోత్సాహకాలు అయితేనేమి, విద్య పరంగా ఎయిమ్స్ మెడికల్ కాలేజీలు, ఐఐటి ఇంజినీరింగ్ కాలేజీలు ఇలా ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టి అటు అభివృద్ధినీ ఇటు సంక్షేమ పథకాల్ని విజయవంతంగా అమలు పరుస్తూ ప్రజల మన్ననను చూరగొన్న గొప్ప వ్యక్తి మోడీ అని అన్నారు. మోడీ పాలన మొదలైన దగ్గరి నుండి ఇప్పటికి దాదాపు వందకు పైగా ముఖ్యమైన కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇప్పటికీ అమలు పరుస్తూ సమాజంలో అందరికి సమన్యాయం చేస్తూ పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. అంతకు మునుపు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలన అభివృద్ధి నిరంతరం కొనసాగాలని కోరుకుంటూ వేంపల్లిలోని శ్రీ దుర్గమ్మ గుడిలో స్థానిక బీజేపీ నేతలతో కలిసి పూజాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేంపల్లి మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, కడప జిల్లా వాణిజ్య సెల్ అధ్యక్షులు దొంతు సుమన్, వృషభాచలేశ్వర దేవాలయ కమిటీ సభ్యుడు సునీల్ , జిల్లా ఎస్.సి మోర్చా ఉపాధ్యక్షులు శ్రీను, జిల్లా సెల్ కన్వీనర్ ప్రసాద్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ

**సీతారామపురం జూన్ 10 సూర్య న్యూస్:** విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం సీతారామపురం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను ఎంఈఓ మస్తాన్ వలి బుధవారం పంపిణీ చేశారు. మొత్తం 40 పాఠశాలలకు గాను 9790 పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాలల పునః ప్రారంభం రోజున పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సమీరారెడ్డి, సిఆర్ఎంటి, ఐఇఆర్పి లు పాల్గొన్నారు.



## భూ దానం కార్యక్రమానికి...
## సహకరించండి

**కుప్పం (టౌన్) జూన్ 10 సూర్య న్యూస్:** పట్టణం లో కొత్తపేటలో వెలసిన శ్రీ ప్రసన్న పెద్దపల్లి గంగమాంబ దేవస్థానం అభివృద్ధిలో భాగంగా భూ దానం కార్యక్రమాన్ని తీసుకువచ్చి ఆలయ పరిసరాలకు ఆనుకుని ఉన్న 34 సెంట్లు స్థలాన్ని కొనుగోలు చేస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షులు శివకుమార్ తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం నాడు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించి భూ దానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ జాతరకు ఆంధ్ర తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున భక్తాదులు అమ్మవారి ఆలయానికి విచ్చేసి, పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇలాంటి క్రమంలో భక్తుల సౌకర్యార్థం, ఆలయ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని అమ్మవారి కృపతో 34 సెంట్లు స్థలాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. పేద భక్తాదులు సైతం దానంలో పాల్గొనేలా సుమారు 85 లక్షల రూపాయలు విలువ చేసే స్థలంలో ఒక చదరపు అడుగు 3000 రూపాయలుగా నిర్ణయించినట్టు తెలిపారు. భక్తులు తమ శక్తానుసారం భూదానం కార్యక్రమానికి విరాళాలు అందించాలని కోరారు. భూ దానం తొలి రోజు కార్యక్రమంలో భాగంగా రెస్కో రిటైర్డ్ ఏ ఏ ఓ రవీంద్ర కుమార్ పది అడుగులకు గాను 30 వేల రూపాయలు, వేద పండితులు సోమశేఖర్ శాస్త్రి 2 అడుగులకు గాను 6001, 90 దాసమానపల్లికి చెందిన చైత్ర ఒక్క అడుగుకు గాను 3001 రూపాయి విరాళాలు అందించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ చైర్మన్ తో పాటు కార్యనిర్వాహకులు వెంకటేష్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, పూజారుల బృందం, భక్తాదులు పాల్గొన్నారు.





## లిఫ్ట్‌లో ఇరుక్కుని మహిళ మృతి..
## నంద్యాలలో విషాదం

**నంద్యాల జూన్ 10 సూర్య న్యూస్ :** పట్టణంలోని ఓల్డ్ టౌన్ ప్రాంతంలో ఉన్న వాసవి కళ్యాణ మండపంలో విషాద ఘటన చోటుచేసుకుంది. బేతంచర్లకు చెందిన శారద అనే మహిళ లిఫ్ట్‌లో ఇరుక్కుని తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. వాసవి క్లబ్ కమిటీ సమావేశానికి హాజరైన శారద, హరి దంపతులు కళ్యాణ మండపంలోని లిఫ్ట్‌ను ఉపయోగించే సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. లిఫ్ట్‌లో సాంకేతిక లోపం కారణంగానే శారద మృతి చెందిందని ఆమె బంధువులు ఆరోపిస్తున్నారు. మృతురాలి భర్త హరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు గల పూర్తి కారణాలు విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.





## దాతలు అభినందనీయులు

**మానవత చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు**

**హనుమాన్ జంక్షన్ జూన్ 10 సూర్య న్యూస్:** మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు బాపులపాడు మాజీ సర్పంచ్ నక్కా పాండురంగారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు నక్కా గాంధీ రూ.75 వేల విలువైన ఫ్రీజర్ బాక్స్‌ను బహూకరించారు. బుధవా రం హనుమాన్ జంక్షన్‌లోని మానవత కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు బాణాల నరసింహారావు, చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావుకు ఫ్రీజర్ బాక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా నక్కా పాండురంగా రావు సమాజ సేవలను పలువురు వక్తలు కొనియాడారు. సేవా కార్యక్రమాలకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని మానవత చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు పేర్కొంటూ, నక్కా గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ గంటా సత్యనారాయణ, ఖజాంచి గంటా ఇందిరాదేవి, డైరెక్టర్లు కొట్నాని రామచంద్రరావు, వడ్డి రాజేశ్వరరావు, సలాం, వేగిరెడ్డి సూర్యనారాయణ, కూరెళ్ల సుబ్బాచారి,సుబ్బారావు మాస్టారు, నారగాని కొండలరావు,లక్ష్మణరావు,నరహరశెట్టి శ్రీధర్, దయాల ప్రభాకర్ రావు, నక్కా నెహ్రూ, నక్కా బాబు,నక్కా చైతన్య,వీరమాచినేని నాగయ్య, పి.వి.చలం తదితరులు పాల్గొన్నారు. అనంతరం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దాత నక్కా గాంధీని ఘనంగా సన్మానించారు.







## టీడీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహణ

**దేవీపట్నం జూన్ 10 సూర్య న్యూస్:** మండలంలో బుధవారం తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం మండల అధ్యక్షుడు గోళ్ళ చంటిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఆదేశాల మేరకు జరిగిన ఈ సమావేశంలో బూత్ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు పేర్కొన్నారు. మండలంలోని ప్రతి యూనిట్‌లో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి పార్టీ కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు మాగాపు బాబురావు, క్లస్టర్ ఇన్‌చార్జి ముచ్చు వీరవెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కీర్తి గంగరాజు, మాజీ మండల అధ్యక్షులు తైలం గంగాధర్, ముంద్రు మధుసూదన్‌రావు, పోశమ్మగండి చైర్మన్ మలుగుల శ్రీనివాస్‌రెడ్డి, పార్లమెంట్ అధికార ప్రతినిధి కారం పోచమ్మ, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు రేలంగి రాంబాబు, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు అడబాల వీరభద్రం, ఏరియా ఇన్‌చార్జి కుంజం రాజామణి తదితరులు పాల్గొన్నారు.




## ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు..
## ముందస్తు వైద్యం తీసుకోవాలి

**అస్వస్థతకు గురైన మహిళను పరామర్శించిన 11వ క్లస్టర్ నాయకులు**

**కుప్పం (టౌన్) జూన్ 10సూర్య న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న సంజీవిని పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య విషయాల్లో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా అప్రమత్తంగా ఉండాలని 11వ క్లస్టర్ నాయకులు సూచించారు. కుప్పం మున్సిపాలిటీ 11వ క్లస్టర్ పరిధిలోని మోడల్ కాలనీకి చెందిన ఓ మహిళ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆమెను కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. తెలుసుకున్న 11వ క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్,యూనిట్ ఇన్‌చార్జి బాబు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు నాగభూషణం, సోమశేఖర్, మాజీ ఉపాధ్యక్షుడు సోము, దిలీప్ ఆసుపత్రికి చేరుకుని బాధిత మహిళను పరామర్శించారు. అనంతరం వైద్యులను కలిసి ఆమె ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించి త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



## వృద్ధులకు అందని బియ్యం,మూడు రోజులకే మూతపడుతున్న
## చౌకు ధాన్యపు డిపోలు-జి. సురేష్ కుమార్

**చైర్మన్ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య మరియు జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్**

**ధర్మవరం జూన్ 10 సూర్య న్యూస్ :** వృద్ధులు, వికలాంగులు నడవలేని 60 సంవత్సరములు పైబడిన వారికి సైతం ఇంటి వద్దకే వచ్చి రేషన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఉన్నప్పటికీ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ అమలు కావడం లేదని ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నట్లు శ్రీ సత్య సాయి జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు మరియు రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ జి సురేష్ కుమార్ తెలియజేశారు. బుధవారం ధర్మవరం వినియోగదారుల సమాచార కేంద్రం నందు ధర్మవరం వినియోగదారుల చిన్న తంబి చిన్నప్ప అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూజిల్లా వ్యాప్తంగా ఎన్నో చౌక ధాన్యపు డిపోల నందు వృద్ధులు వేలిముద్ర వేయడానికి తంటాలు పడవలసి వస్తుందని అక్కడికి పోతే వేలిముద్ర పడలేదని తిరిగి పంపుతున్నారని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కేవలం మూడు నాలుగు రోజులు రేషన్ పంపిణీ చేసి అనంతరం స్టాక్ లేదని త్రిప్పి పంపుతున్నారని తెలియజేశారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ డీలర్లలో మార్పు రావడంలేదని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలానికి ఒక సివిల్ సప్లై మరియు వినియోగదారుల వ్యవహారాల కోసం ఒక డిప్యూటీ తాసిల్దార్ ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో తనిఖీల నిర్వహించకపోవడం వల్లే ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని సురేష్ కుమార్ తెలియజేశారు. ప్రతినెల వృద్ధులకు పింఛన్లు ఇచ్చే విధంగా ఆయా స్టోర్ ల నందు వృద్ధులు ఎంతమంది ఉన్నారు అనే సమాచారం కచ్చితంగా సచివాలయ ఉద్యోగుల వద్ద ఉంటుంది కాబట్టి సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్లు వారిని కలుపుకుని మండల వ్యాప్తంగా ఉన్నటువంటి వృద్ధుల కు పెన్షన్ ఏ విధంగా అందుతుందో అదే విధంగా రేషన్ కూడా అందేటట్లుగా చూడాలని తెలియజేశారు. చౌక ధాన్యపు డిపో నందు కంప్లైంట్ నంబరు మరియు క్యూఆర్ కోడ్ ప్రజలకు కనపడే విధంగా పెద్ద అక్షరాలతో ఏర్పాటు చేయాలని తద్వారా ప్రజలకు అందవలసిన రేషన్ కచ్చితంగా అందుతుందని తెలియజేశారు. రేషన్ దుకాణం ఎన్ని రోజులు తీసి ఉంచాలి అన్న దానిపై స్పష్టమైన ఆదేశాలు ఉన్నతస్థాయి అధికారులు డీలర్లకు ఇవ్వాలని లేనిచో మూడు నాలుగు రోజులకే రేషన్ డిపోను మూసివేస్తారని తెలిపారు. ప్రతి మండలంలోని విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసినట్లయితే చౌక ధాన్యపు డిపోల పర్యవేక్షణ మరియు ప్రజలకు అవగాహన కలిగించేందుకు అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం మండల వినియోగదారుల సంఘం అధ్యక్షులు చిన్న తంబి చిన్నప్ప, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పల్లెం జనార్ధన్ , ప్రధాన కార్యదర్శి గుర్రం వేణుగోపాల్ క్యాప్కో నారాయణమ్మ, వైస్ ప్రెసిడెంట్ సెల్వరాజ్, బి ఎజన్న, నవీన్ కుమార్, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ బస్టాండ్‌లో ఆహార భద్రత అధికారుల మెరుపు దాడులు

**లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్న దుకాణాలకు నోటీసుల... అనుమానాస్పద ఆహార పదార్థాల స్వాధీనం**







**నంద్యాల జూన్ 10 సూర్య న్యూస్:** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పరిధిలో ఆహార భద్రత అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్‌లోని కూల్‌డ్రింక్, స్నాక్స్, టీ స్టాల్స్‌ను పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, లైసెన్సుల వివరాలను తనిఖీ చేశారు. తనిఖీలలో పలువురు వ్యాపారులు ఫుడ్ లైసెన్స్‌లు లేకుండానే దుకాణాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించిన అధికారులు వారికి నోటీసులు జారీ చేశారు. లైసెన్స్‌లు లేకుండా ఆహార పదార్థాల విక్రయం చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పదంగా ఉన్న కొన్ని కూల్‌డ్రింక్స్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయాల్లో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని వ్యాపారులకు సూచించారు. ఫుడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న పలువురికి జరిమానాలు కూడా విధించినట్లు అధికారులు తెలిపారు.

### పారిశుద్ధ్య నిర్వహణలో తాడిపూడి పంచాయతీకి

# రాష్ట్ర స్థాయి గుర్తింపు

**ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా తానేటి నవీనకు అవార్డు**

**-గ్రామ ప్రజల సహకారంతోనే విజయం సాధ్యమైందని వ్యాఖ్య**

**తాళ్లపూడి జూన్ 10 సూర్య న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామ పంచాయతీలకు, పంచాయతీ కార్యదర్శులకు అవార్డులు ప్రదానం చేసింది. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లాలో ఐదు గ్రామ పంచాయతీలు ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక కాగా, తాళ్లపూడి మండలంలోని తాడిపూడి గ్రామ పంచాయతీ కూడా ఆ జాబితాలో చోటు దక్కించుకుంది. తాడిపూడి గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల సక్రమ నిర్వహణలో విశేష కృషి చేసినందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి తానేటి నవీనకు ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా అవార్డు లభించింది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కమిషనర్ సుధాకర్ బాబు చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా నవీన మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతోనే ఈ గుర్తింపు సాధ్యమైందని, భవిష్యత్తులో గ్రామాన్ని మరింత పరిశుభ్రంగా, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. అవార్డు అందుకున్న తానేటి నవీనను ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ నాయకులు, ప్రజలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.




### విజయవంతంగా ముగిసిన..

# యువశక్తి వేసవి కంప్యూటర్ శిక్షణ శిబిరం

**గుంతకల్లు జూన్ 10 సూర్య న్యూస్:** వేసవి సెలవుల సందర్భంగా యువశక్తి కంప్యూటర్ శిక్షణ సంస్థ నిర్వహించిన కంప్యూటర్ శిక్షణ శిబిరం విజయవంతంగా ముగిసింది. శిబిరంలో పాల్గొన్న 70 మంది విద్యార్థులకు థియరీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ టి. జయన్న మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి విద్యార్థికి అవసరమని, సాంకేతిక నైపుణ్యాలే భవిష్యత్ విజయానికి పునాదిగా నిలుస్తాయని అన్నారు. శిబిరంలో ప్రాథమిక కంప్యూటర్ విద్య, కార్యాలయ వినియోగ సాఫ్ట్‌వేర్‌లు, అంతర్జాల వినియోగం, డేటా నమోదు, టైపింగ్ నైపుణ్యాలు, డిజిటల్ సేవలపై శిక్షణ అందించినట్లు తెలిపారు. శిక్షణ అనంతరం నిర్వహించిన పరీక్షల ప్రశ్నాపత్రాలను శస్త్ర జూనియర్ కళాశాల కరస్పాండెంట్ బి. శేఖర్, గుత్తి శాఖ డైరెక్టర్ అరుణ్ కుమార్ విడుదల చేశారు. పరీక్షలను అరుణ్ కుమార్ పర్యవేక్షించారు. గత 20 ఏళ్లుగా యువశక్తి సంస్థ ద్వారా వేలాది మంది విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందిస్తున్నామని, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన శిక్షణ అందిస్తున్నామని జయన్న తెలిపారు. కార్యక్రమంలో శస్త్ర కళాశాల ప్రిన్సిపాల్ రమణ, సంస్థ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల పెంపుదలకు యువశక్తి సంస్థ చేస్తున్న సేవలను పలువురు అభినందించారు.





# టీడీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహణ

**దేవీపట్నం జూన్ 10 సూర్య న్యూస్:** మండలంలో బుధవారం తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం మండల అధ్యక్షుడు గోళ్ళ చంటిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఆదేశాల మేరకు జరిగిన ఈ సమావేశంలో బూత్ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు పేర్కొన్నారు. మండలంలోని ప్రతి యూనిట్‌లో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి పార్టీ కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు మాగాపు బాబురావు, క్లస్టర్ ఇన్‌చార్జి ముచ్చు వీరవెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కీర్తి గంగరాజు, మాజీ మండల అధ్యక్షులు తైలం గంగాధర్, ముంద్రు మధుసూదన్‌రావు, పోశమ్మగండి చైర్మన్ మలుగుల శ్రీనివాస్‌రెడ్డి, పార్లమెంట్ అధికార ప్రతినిధి కారం పోచమ్మ, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు రేలంగి రాంబాబు, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు అడబాల వీరభద్రం, ఏరియా ఇన్‌చార్జి కుంజం రాజామణి తదితరులు పాల్గొన్నారు.



### బాలయ్య జన్మదిన వేడుకలు

# ఘనంగా నిర్వహణ

**కర్నూలు జూన్ 10 సూర్య న్యూస్:** నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను కర్నూలులో ఘనంగా నిర్వహించారు. వైఎన్ఆర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హిందూపురం రాష్ట్ర టీడీపీ పరిశీలకుడు, డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, పోతురాజు రవికుమార్, తిరుపాలు, సుజాత, కృష్ణాజీ రావు, నంది మధు, నాయుడు, వెంకటేష్, కుమ్మరి రామకృష్ణ, రాజేష్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, బాలయ్య అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వై. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ, బాలకృష్ణ సినీ రంగంలో విజయవంతమైన నటుడిగా, రాజకీయాల్లో ప్రజా ప్రతినిధిగా సేవలందిస్తున్నారని కొనియాడారు. హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా పేదలకు వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ "జై బాలయ్య" నినాదాలతో సందడి చేశారు.



# ధర్మవరం మెప్మా కార్యాలయంలో ఉద్రిక్తత..!

**గ్రూపుల నుంచి వైదొలుగుతున్న సభ్యులు-సీఓలతో మహిళల వాగ్వాదం**

**ఎవరికి చెప్పుకున్నా చివరకు మా దగ్గరకే రావాలి అంటూ ఆర్పీకి బెదిరింపుల ఆరోపణలు**

**శ్రీ సత్యసాయి బ్యూరో జూన్ 10 సూర్య న్యూస్:** జిల్లా లోని ధర్మవరం మున్సిపాలిటీ మెప్మా కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులు, సీఓల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. తాము గ్రూపు నుంచి వైదొలుగుతున్నామని, తమ పేర్లను గ్రూపు నుంచి తొలగించాలని కోరుతూ మహిళలు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆర్పీ ఇందిర, నిహారిక మహిళా గ్రూపును తన లాగిన్‌లో చేర్చేందుకు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. గ్రూపులో నకిలీ సభ్యుల పేర్లతో రుణాలు తీసుకున్నారనే అనుమానాలు ఉన్న నేపథ్యంలో భవిష్యత్తులో తాను ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంటూ ఆ గ్రూపును తన పరిధిలోకి తీసుకోవడానికి నిరాకరించారు. అయితే సీఓలు తమను పదేపదే కార్యాలయానికి పిలిపించి వేధిస్తున్నారని "మంత్రికి చెప్పినా, పరిటాల శ్రీరామ్‌కు చెప్పినా చివరకు మా దగ్గరకే రావాలి" అంటూ బెదిరించారని ఆర్పీ ఇందిర ఆరోపించారు. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన మహిళా గ్రూపు సభ్యులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గ్రూపు సభ్యుల స్థానంలో మాజీ ఆర్పీ పొదుపు డబ్బులు చెల్లించడం, సభ్యులకు ఫోన్ చేసి ఓటీపీలు అడుగుతున్నారనే ఆరోపణలపై మీడియా ప్రశ్నించగా సంబంధిత ఆర్పీలు సమాధానం చెప్పలేకపోయారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళితే ఎలాంటి చర్యలు ఉంటాయో వేచి చూడాల్సి ఉంది.





### వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమాన్ని

# జయప్రదం చేయండి

**: మండల వైసీపీ కన్వీనర్ చింతం రెడ్డి సుబ్బారెడ్డి**

**సీతారామపురం జూన్ 10 సూర్య న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రివై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకుఉదయగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రేపు (శుక్రవారం) ఉదయం 10 గంటలకుఉదయగిరి పట్టణంలో వెన్నుపోటుకు రెండేళ్లుభారీనిరసన ర్యాలీ నిర్వహించబడుతుందని సీతారామపురం మండల వైసిపి కన్వీనర్ చింతం రెడ్డి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సీతారామపురం మండలంలోని అన్ని గ్రామాల నుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, యువజన, విద్యార్థి, మహిళా, రైతు, కార్మిక విభాగాల సభ్యులు, గ్రామ కమిటీ ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, అన్యాయాలకు వ్యతిరేకంగా, జూన్ 12 నిరసన ర్యాలీ ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.



### మరమ్మత్తుల కారణంగా నేడు కొన్ని ప్రాంతాల్లో

# విద్యుత్ సరఫరా నిలిపివేత

**వేంపల్లె జూన్ 10 సూర్య న్యూస్:** నేడు గురువారం పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర ట్రాన్స్ఫార్మర్ మరమ్మత్తులు చేయుట వలన నేడు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇన్ చార్జ్ ఏఈ మైకేల్ జాక్సన్ తెలిపారు. ఆర్టిసి బస్టాండ్ ఏరియా, పోలీస్ స్టేషన్, ఆర్ అండ్ బి బంగ్లా, టీటీడీ కల్యాణ మండపం ఏరియా, ఉషాకిరణ్ స్కూల్ ఏరియా, చైతన్య స్కూల్ ఏరియా, గవర్నమెంట్ హాస్పిటల్, మౌని బాబా గుడి ఏరియా, 7 సచివాలయం ఏరియా, ఎస్బిఐ బ్యాంక్ ఏరియా,యూనియన్ బ్యాంక్ ఏరియా, గరుగు వీధి హైస్కూల్ ఏరియా, పాత గర్ల్స్ స్కూల్ ఏరియా, న్యూ గర్ల్స్ స్కూల్ ఏరియా, బాలి శెట్టి సందు, హచ్ టవర్ ఏరియాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




### ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై

# మండల స్థాయి శిక్షణ తరగతులు

**ఓటర్ల జాబితా ప్రక్షాళనలో ప్రతి కార్యకర్త బాధ్యతగా వ్యవహరించాలి: సిద్ధా దుర్గాప్రసాద్**

**తాళ్లపూడి జూన్ 10 సూర్య న్యూస్ :** తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు నెలలో రెండో బుధవారం నిర్వహించాల్సిన మండల సమావేశాన్ని తాళ్లపూడి మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు సిద్ధా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ బాధ్యులు, సమూహ బాధ్యులు, పోలింగ్ కేంద్ర స్థాయి ప్రతినిధులకు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం సాధారణంగా 20 నుంచి 25 సంవత్సరాలకు ఒకసారి జరుగుతుందని, గతంలో 2002లో నిర్వహించగా ప్రస్తుతం 2026లో మరోసారి చేపడుతున్నట్లు తెలిపారు. 2002 ఓటర్ల జాబితాతో ప్రస్తుత జాబితాను సరిపోల్చి పరిశీలించడం ద్వారా వలస వెళ్లిన వారు, ఆచూకీ లేని వారు, మరణించిన వారు, నకిలీ ఓటర్ల పేర్లను తొలగించి ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడం ప్రధాన ఉద్దేశమన్నారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్లు, గతంలో జాబితాలో చేరని అర్హులైన వారిని చేర్చడం కూడా ఈ కార్యక్రమం లక్ష్యమని వివరించారు. మండలంలోని ప్రతి పోలింగ్ కేంద్ర స్థాయి బాధ్యుడు ఎన్నికల సిబ్బందితో కలిసి ప్రతి ఓటరును తప్పనిసరిగా గుర్తించి నమోదు వివరాలు సరిచూడాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి బాధ్యులు, గ్రామ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### విశాఖ స్టీల్ ప్లాంట్ మృతుల కుటుంబాలకు

# రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

**ప్రతి కుటుంబానికి ఉద్యోగం, ఇంటి స్థలం కల్పించాలని బీఎస్పీ నేత జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్**

**జగ్గంపేట జూన్ 10సూర్య న్యూస్:** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం సరిపోదని, ప్రతి మృతుడి కుటుంబానికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా అందించాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) కాకినాడ జిల్లా అడ్వైజర్ జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం జగ్గంపేట మండలంలోని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ప్రకటించిన రూ.25 లక్షల ఆర్థిక సహాయం అభినందనీయమే అయినప్పటికీ, బాధిత కుటుంబాలు ఎదుర్కొంటున్న నష్టానికి అది ఏమాత్రం సరిపోదన్నారు. ప్రమాదంలో కుటుంబ పెద్దలను కోల్పోయిన వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, ప్రతి మృతుడి కుటుంబానికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలోని ఒకరికి శాశ్వత ఉద్యోగం, అలాగే ఇంటి స్థలం కేటాయించాలని ఆయన కోరారు. కార్మికుల ప్రాణ భద్రత విషయంలో పరిశ్రమలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన భద్రతా చర్యలు అమలు చేయాలని ఆయన సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచి తగిన న్యాయం చేయాలని జుత్తుక నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# మానసిక వికలాంగుల ఉపాధికి రోటరీ అండ

**అమ్మా ఫౌండేషన్‌కు రూ.4 లక్షల విరాళం**

**'బెస్ట్ రన్నర్స్ అమెరికా' సహకారంతో దివ్యాంగుల వృత్తి నైపుణ్యాభివృద్ధికి ఆర్థిక సాయం**

**అన్నార్తుల సేవే పరమార్థం.. సేవా కార్యక్రమాల్లో ముందున్న నాయుడుపేట రోటరీ క్లబ్**

**నాయుడుపేట జూన్ 10 సూర్య న్యూస్ :** సమాజంలో శారీరక, మానసిక వైకల్యాలతో బాధపడుతున్న దివ్యాంగులకు అండగా నిలిచి వారి స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు నాయుడుపేట రోటరీ క్లబ్ మరోసారి తన సేవాభావాన్ని చాటుకుంది. పట్టణంలోని అమ్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల జీవనాధార వృత్తివిద్యా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు మద్దతుగా రూ.4 లక్షల భారీ విరాళాన్ని బుధవారం అందజేసింది. 'బెస్ట్ రన్నర్స్ అమెరికా' సంస్థ ప్రత్యేక సహకారంతో అందించిన ఈ నిధులను చెక్కు రూపంలో అమ్మా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కృష్ణవేణికి రోటరీ క్లబ్ ప్రతినిధులు అందజేశారు. ఈ ఆర్థిక సాయం ద్వారా మానసిక వికలాంగులకు వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగూరయ్య మాట్లాడుతూ, మానసిక వికలాంగుల ప్రతిభను వెలికితీసి వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అమ్మా ఫౌండేషన్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. గతంలో కూడా పాఠశాలకు పలు మౌలిక వసతులు కల్పించామని, ప్రస్తుతం కొత్త వృత్తి విద్యా కోర్సుల అమలుకు తోడ్పడేందుకు ఈ విరాళం అందించినట్లు చెప్పారు. రోటరీ క్లబ్ సేవలు దివ్యాంగులకే పరిమితం కాకుండా, ఒంటరి మహిళల ఆర్థికాభివృద్ధి, పేద విద్యార్థుల ఉన్నత విద్య, నిరుపేదలకు వైద్య సహాయం వంటి అనేక రంగాల్లో కొనసాగుతున్నాయని ఆయన వివరించారు. ఈ సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న 'బెస్ట్ రన్నర్స్ అమెరికా' సంస్థతో పాటు స్థానిక దాతలు, క్లబ్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రెటరీ బట్ట సుబ్రహ్మణ్యం, ఎలెక్ట్ ప్రెసిడెంట్ రామ్మోహన్, ఎలెక్ట్ సెక్రెటరీ కృష్ణమోహన్, నాయకులు చంద్రశేఖర్, ఉదయ్ శంకర్, నాగరాజు, కె.వి. కృష్ణారావు, హెచ్. సుబ్రహ్మణ్యం, బి. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ముందుకొచ్చిన దాతలను పట్టణ ప్రజలు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.



సూర్య
జాతీయ తెలుగు దినపత్రిక
గురువారం 11 జూన్, 2026

# నిద్రమత్తులో ఏపీఎస్ఆర్టీసీ... మంత్రాలయం పార్సిల్ సిబ్బంది..?

**పార్సిల్ అందినా డెలివరీలో తీవ్ర జాప్యం**

**అడిగితే "మాకు సంబంధం లేదు" అంటూ నిర్లక్ష్య సమాధానాలు**

**కర్నూలు బ్యూరో జూన్ 10 సూర్య న్యూస్:** జిల్లాలోని మంత్రాలయం ఏపీఎస్ఆర్టీసీ పార్సిల్ సేవల నిర్వహణపై వినియోగదారుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.




గమ్యస్థానానికి పార్సిళ్లు చేరుకున్నప్పటికీ, వాటిని సంబంధిత వ్యక్తులకు సకాలంలో అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.పార్సిల్ వచ్చిన విషయం తెలిసినా, గంటల తరబడి లేదా కొన్ని సందర్భాల్లో రోజులు గడిచినా డెలివరీ జరగడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. దీనిపై సిబ్బందిని ప్రశ్నిస్తే, "మాకు సంబంధం లేదు", "ఎప్పుడు ఇస్తామో చెప్పలేం" వంటి నిర్లక్ష్యపూరిత సమాధానాలు ఇస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేయాల్సిన పార్సిల్ విభాగంలో ఇటువంటి పరిస్థితులు నెలకొనడం పట్ల వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అత్యవసర పత్రాలు, మందులు, వ్యాపార వస్తువులు పంపించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు.సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, పార్సిల్ సేవలలో ఉన్న లోపాలను సరిదిద్ది, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.అలాగే పార్సిళ్లను సకాలంలో అందించేలా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. "ప్రజలకు సేవ చేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, ప్రభుత్వ సేవలపై ప్రజల నమ్మకం దెబ్బతింటుంది" అని పలువురు వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు.

# ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో సిఐ ప్రసాద్ రావు కీలక పాత్ర

**హెల్మెట్ సీట్ బెల్ట్ తనిఖీలు ముమ్మరం - ప్రమాదాలు తగ్గుదల**

**రూల్స్ ఉల్లంఘనపై జీరో టాలరెన్స్ విధానం**

**పులివెందుల జూన్ 10 సూర్య న్యూస్:** పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా ఎస్పి 'షెల్కే నచికేత్ విశ్వనాథ్" ఆదేశాల మేరకు ట్రాఫిక్





సిఐ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ఆయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటూ వస్తున్నారు.రోజూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బస్టాండ్ సెంటర్, ఆర్ అండ్ బి కూడలి, ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, నో పార్కింగ్ ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించారు.వి.ఐ.పి' సాధారణ ప్రజల అనే తేడా లేకుండా అందరికీ ఒకే రూల్ అమలు చేస్తున్నారని ప్రజలు, చెబుతున్నారు.

**ప్రమాదాల సంఖ్య తగ్గుదల:** గత ఏడాది ఇదే కాలంలో పులివెందుల పరిధిలో 32 రోడ్డు ప్రమాదాలు జరిగితే, ఈ ఏడాది 24 ప్రమాదాలు మాత్రమే జరిగాయి. మరణాల సంఖ్య కూడా 12 నుంచి 8కి తగ్గింది. హెల్మెట్, సీట్ బెల్ట్ తనిఖీలు ముమ్మరం చేయడమే ఇందుకు కారణమని సిఐ ప్రసాద్ రావు తెలిపారు.

**ప్రజా చైతన్య కార్యక్రమాలు:** స్కూళ్లు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆటో డ్రైవర్లు, బైక్ మెకానిక్‌లతో సమావేశాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు. "ముందు ప్రాణం... తర్వాత కేసు" అనే నినాదంతో అత్యవసర సమయంలో గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించే చర్యలు తీసుకుంటున్నారు.

**సిబ్బంది పర్యవేక్షణ:** ట్రాఫిక్ సిబ్బందికి రోజూ బ్రీఫింగ్ ఇచ్చి, ఎండలో విధులు నిర్వహించే కానిస్టేబుళ్లకు మంచినీటి సదుపాయం కల్పిస్తున్నారు. డ్యూటీ సమయాలను క్రమబద్ధీకరించి సిబ్బంది ఇబ్బందులు తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు.

**ప్రజల స్పందన:** ట్రాఫిక్ రూల్స్ విషయంలో సిఐ ప్రసాద్ రావు కఠినంగా వ్యవహరిస్తున్నా, ప్రజలు మాత్రం నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలు తగ్గాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిఐ ప్రసాద్ రావు మాటల్లో రూల్ అందరికీ ఒకటే. మీరు సేఫ్‌గా ఇంటికి చేరితే అదే నాకు ఇచ్చే గౌరవం" అని సిఐ ప్రసాద్ రావు పేర్కొన్నారు.

# కాలంగి నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

**సూళ్ళూరుపేట జూన్ 10 సూర్య న్యూస్ :** పట్టణంలోని చెంగలమ్మ ఆలయానికి దక్షిణ దిశలో ఉన్న కాలంగి నదిలో గుర్తు తెలియని మహిళా మృతదేహం బుధవారం లభ్యమైంది.?స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి



చేరుకుని పరిశీలించారు. మృతురాలి వయస్సు సుమారు 55 నుండి 60 ఏళ్ల మధ్య ఉంటుందని అంచనా. ఆమె ఆకుపచ్చ రంగు జాకెట్, ఆకుపచ్చ రంగు చీర ధరించి ఉన్నారు. బట్టలు ఉతకడానికి లేదా స్నానం చేయడానికి నదిలోకి దిగిన సమయంలో ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మరణించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. స్థానిక పరిసరాల్లో విచారించినా ఆమె వివరాలు తెలియరాలేదు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలిని గుర్తించిన వారు లేదా ఆమె గురించి తెలిసిన వారు సూళ్ళూరుపేట పోలీసులను సంప్రదించాలని కోరారు. స్థానిక పరిసరాల్లో విచారించినా ఆమె వివరాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలిని గుర్తించిన వారు లేదా ఆమె గురించి తెలిసిన వారు సూళ్ళూరుపేట పోలీసులను సంప్రదించాలని కోరారు.

# రెవెన్యూ అధికారుల మాయా జాలం..!

**రాత్రికి రాత్రే పది ఎకరాల భూములు బదిలీ..?...మాజీ తహసీల్దార్, మాజీ సర్పంచులపై పోలీసులకు ఫిర్యాదు..!**

**మరణించిన వారి సంతకా లు నాలుగేళ్ల తరువాత ఫోర్జరి..!**

**కేవీబీపురం జూన్ 10 సూర్య న్యూస్:** మండలం లో అధికార పార్టీ నేతల భూ ఆక్రమణ పర్వం మరోసారి వెలుగులోకి వచ్చింది. ఆ నేతకు సాక్ష్యత్తు మండల తహసీల్దా ర్ సహకరించడంతొ సుమారు 15 ఏళ్లుగా పట్టాదారుల సాగులో ఉన్న పది ఎకరాల డీకేటి భూమిని నియ మాలకు వ్యతిరేకంగా, రాత్రికి రాత్రే వేరొకరి పైకి భదిలీ చేసారు. ఇలా బదిలీ చేసిన పక్కరోజే ఆ తహసీ ల్దార్ పదవి విరమణ పొందడం విశేషం..

**అస్సలు కథ ఇది :-** మండలంలోని తిమ్మసముద్రం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 284/3పి లోని 1.06 ఎకరాలు, 284/4డి 2.1 ఎకరాలు, 284/5బి 1.17 ఎకరాలు, 286/4 లొ 2.42 ఎకరాలు, ఇలా మొత్తం పది ఎకరాల భూమి పై భాస్కర్ రావు, ఆయన తల్లి పేట్ కమలమ్మ, ఆయన భార్య మంజుల అనే వారుపాసుపుస్తకాలు, వన్ బీ, అడంగల్తొ 30/12/ 2025 వరకు పూర్తి హక్కులు కలిగి ఉన్నారు. సదరు భూమిలో గత 15 ఏళ్లుగా మామిడి,నిమ్మతోట సాగుతో పాటు, కోళ్ల ఫామ్ మరియూ డైరీ ఫామ్ ను నడుపుతున్నారు. ఈ క్రమంలొ భాస్కర్ రావు 25/ 02/2025 న కాలం చల్లించారు. ధీంతో ఆరు నెలలు తోటలో అసలైన యజమానులు రాకపోకలు కుంటుపడ్డాయ్. ఇదే అదునుగా భావించిన స్థానిక టీడీపీ మాజీ ప్రజా ప్రతినిధి ఆ భూమిపై కన్నెసాడు. అంతే.అప్పటి వరకు భాస్కర్ రావు కుటుంబీకుల పరిధిలొ, సర్వహక్కులతొ సాగులో ఉన్న ఆ భూమి 30/12/2025 న ఏర్పేడు మండలం పళ్యాం గ్రామని కి చెందిన శేషాద్రి నాయుడు అనే వ్యక్తి పేరు మీదకు భదిలీ అయింది. ఈ అక్రమణ పర్వం వెనుకనున్న ఆ టీడీపీ నేత భాస్కర్ రావు మరణం వరకు ఆ కుటుంబానికి అత్యంత సన్నిహితుడే. ఈ విషయం తెలియని భాదిత కుటుంభ సభ్యులు తమ తోటలోకి వచ్చారు. వారి రాకను తెలుసుకున్న ఆ టీడీపీ నేత తోటకు చేరుకుని భాస్కరావు భార్య మంజుల,అతని కుమారుల ను పరిచయమేలేనట్టు తమ భూమిలోకి మీరెలా వస్తారని ప్రశ్నించాడు.తమ అనుమతి లేకుండా తమ భూముల్లోకి అడుగు పెడితే వదలమని బెదిరించారు.ధీంతో మంజుల, ఆమె కుమారుడు కంగు తిన్నారు. అనంతరంసంభందిత భూముల తాలూకు పత్రాలను ఆన్లై న్లొ తనిఖీ చేయగా, అప్పటికే ఆ భూములు మొత్తం శేషాద్రి నాయు డు పేరు మీదకు మారిపోయి ఉండటాన్ని గమనించి రెవెన్యూ అధికారులను సంప్రదించగా గత ఏడాది డిసెంబర్ 31న పదవి విరమ ణ పొందిన అప్పటి తహసీల్దార్ పదవి విరమణకు ముందు రోజే ఈ భూములు అన్నీ ఏర్పేడు మండలం కు చెందిన వ్యక్తి పేరు మీదకు మార్చేసినట్లు గుర్తించారు.







**జరిగింది ఇలా:-** 30/12/2025 వరకు కేవీబీపురం తహసీల్దార్ గా విధులు నిర్వహించి న రోశయ్య అనేక ఆరోపణలు ఎదు ర్కొన్నారు.ఓళ్లూరు, తిమ్మసముద్రం గ్రామాల్లో పక్కా సెటిల్మెంట్ భూము లను సైతం ఎలాంటి విచారణ లేకుండా టీడీపీ నేతలు చెప్పిన వారికి అప్పగించేసారన్న ఆరోపణ లు ఉన్నాయ్. ఇదే విషయంగా తిమ్మసముద్రం గ్రామానికి చెందిన రమణయ్యనాయుడు, వెంకటముని అనే భాధితులు కూడా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు, ఇక్కడ సరైన సమాధానం దొరక్క పోవడంతొ తహసీల్దార్ పనితీరుపై విచారణ చేయాలని కోరుతూ హైకోర్టులొ ఫిటిషన్ దాక లు చేసారు. అంతే కాకుండా లోఖా యుక్తలొ ఫిర్యాదు చేసారు.రోశయ్య తహసీల్దార్ గా ఉన్నన్ని రోజులు తహసీల్దార్ కార్యాలయం అనేక ఆరోపణలతొ నిత్యం వార్తల్లో ఉండే ది. ఇదే తరహాలొ భాస్కర్ రావు కుటుంభంకి చెందిన భూములను పక్కదారి పట్టించారని భాధితులు ఆరోపిస్తున్నారు.

**చనిపోయిన వారు నాలుగేళ్ళ తరువాత వచ్చి సంతకాలు చేసారట..!**

భాస్కర్ రావు తల్లి కమలమ్మ వృద్ధాప్యంతొ 2017లొ మరణించారు. ఆమె మరణాన్ని ధ్రువీకరిస్తూ బరియల్ గ్రౌండ్ సర్టిఫికేట్ కూడా మంజూరు చేసి ఉన్నారు. అయితే శేషాద్రి నాయుడు రాసుకున్న ఆస్తి విక్రయ పత్రంలొ మాత్రం 20 17 లొ మరణించినకమలమ్మ తన ఆస్తిని అమ్మేందుకు 202 0 లొ మళ్ళీ తిరిగి వచ్చి 01/ 05/2020 విక్రయ పత్రం మీద సంతకాలు చేసి ఇచ్చినట్టు చూపించి ఉన్నారు. ఈ సంత కాల ఆధారంగానే గత తహసీ ల్దార్ రోశయ్య గుడ్డిగాపట్టాలు మార్చి ఇవ్వడం ఇప్పుడు చర్చనీయంసంగా మారుతుం ది. ఇది ఇలా ఉంటే బాధ్యత గా, హుందాగా వ్యవహారించా ల్సిన మండల తహసీల్దార్ ఇలా పార్టీ నేతలకు కొమ్ముకా సి, రైతుల కడుపు కొట్టడం దారుణమని భాదిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా:-** సాధారణంగా డీకేటి పట్టాల మార్పు అనేది జిల్లా అధికారుల ధ్రువీకరణ మీద ఆధారపడి ఉండే విషయం.ఏదైనా డీకేటీ పట్టాలొ మార్పు చేయాలంటే వంద వంకలు చెప్పే రెవెన్యూ అధికారులు, ఇలా పదుల సంఖ్యలొ సెటిల్మెంట్ భూములు, డీకేటి భూములను యదేత్ఛగా మార్చేయడం పట్ల తీవ్ర అనుమా నాలు వ్యక్తమౌతున్నాయి. తండ్రి మరణాంతరం కొడుకు వారసత్వ హక్కుగా వచ్చిన డీకేటి భూములు, ఎన్నో ఏళ్లుగా సాగులో ఉన్న భూములకు పట్టాలు కల్పించాలని కోరుతూ ఇప్పటికే వందలాది మంది రైతులు కేవీబీపురం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వారికి మంజూరు కాని పట్టాలు, వారికి లభించని బధిలీ సేవలు పార్టీ నేతలకు మెండుగా అందడం విశేషం.పేదలకు ఒకన్యాయం, పెద్దలకు ఒక న్యాయం అని కేవీబీపురం రెవెన్యూ అధికారులు తమ దొందవైఖరి తొ మరో సారి నిరూపించుకున్నారన్న మాటలు విపిస్తున్నాయ్. మండలంలొ పుట్టి, నివాసం ఉంటున్న వారికి ఒక సాగు భూమి కల్పించాలని వారానికి వంద దరఖాస్తులు వస్తున్నా ఒక్కరికి కుడా భూమి కల్పించని రెవెన్యూ అధికారులు.ఇలా తప్పుడు భదిలీలతొ వందలాది ఎకరాలను పెద్దలకు ధార ధత్తం చేస్తున్నారని మండల ప్రజలు మండిపడుతున్నారు.ఇలా తప్పుడు భాదిలీలకు సహకరిస్తున్నవి ఆర్ ఓ ర్వోల నుండి తహసీల్దార్ వరకు కఠిన శిక్షలు ఎదుర్కొంటే తప్ప ప్రజల్లో అధికారులపై నమ్మకం రాధన్నది వామపక్ష్యాల వాదన.ఈ అక్రమ భూ భదిలీలపై జిల్లా అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఇదే విషయమై భాస్కర్ రావు కుటుంభ సభ్యులు న్యాయం చేయాలని, తమకు రక్షణ కల్పించాలని బుధవారం కేవీబీపురం పోలీసులకు ఫిర్యాదు చేసారు.

# పిచ్చిమొక్కలు తొలగింపు

**పరివేక్షించిన డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్**

**చౌడేపల్లి జూన్ 10 సూర్య న్యూస్ :** మండల కేంద్రమైన చౌడేపల్లి నందు బుదవారం స్వచ్ఛపథం కార్యక్రమంలో భాగంగా చౌడేపల్లి పలమనేరు ప్రధాన రహదారికి ఇరువైపులా



పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థ పదాలు తొలగించడమైనది. అదేవిధంగా డోర్ టూ డోర్ చెత్తసేకరణ,ఐవిఆర్ఎస్ కాల్స్ పై అవగాహన కల్పిఃచడమైనది. అంతే కాకుండా ప్రజలు కూడా పంచాయతీ సిబ్బందికి సహకరించాలని, వారు కోరడమైనది. ఈ కార్యక్రమంలో పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ శివయ్య,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మండల తహసీల్దార్‌గా... బాధ్యతలు చేపట్టిన కె. శిరీష

**తర్లుపాడు జూన్ 10 సూర్య న్యూస్:** మండలతహసీల్దార్‌గా కె. శిరీష బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పెద్దారవీడు మండల తహసీల్దార్‌గావిధులునిర్వహించిన ఆమె, పరిపాలనా పరమైన బదిలీల్లో భాగంగా తర్లుపాడుకు బదిలీపై వచ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా కృషి చేస్తానని తెలిపారు. రెవెన్యూ పరమైనసమస్యలపరిష్కారానికి, కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటిఇబ్బందులు లేకుండా చూస్తానని ఆమె పేర్కొన్నారు.



నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శిరీషకు మండల రెవెన్యూ సిబ్బంది, పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలా..?

**రామేశ్వరంపేటలో ఆరోపణల దుమారం..!....డీ పట్టా భూముల్లో మూడు అంతస్తుల భవనాలు.. అనుమతులపై ప్రశ్నలు..!**

**హాస్టళ్ల పేరిట వ్యాపారం చేస్తున్నారంటూ గ్రామస్తుల ఆరోపణలు..అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్**

**గండేపల్లి జూన్ 10 సూర్య న్యూస్:** మండలం లోని రామేశ్వరంపేట గ్రామంలో ప్రభుత్వ డీ పట్టా భూముల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. పేదల సంక్షేమం కోసం కేటాయించిన భూములను కొందరు వ్యక్తులు అక్రమంగా స్వాధీనం చేసుకుని భారీ నిర్మాణాలు చేపడుతున్నారంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారం అధికారుల దృష్టికి వెళ్లినా ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలో నెల రోజుల వ్యవధిలోనే మూడు అంతస్తుల భవనాలు నిర్మాణం పూర్తి చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. సాధారణ ప్రజలు చిన్న ఇంటి నిర్మాణానికే అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంటే, ఇంత భారీ భవనాలు ఎలా నిర్మితమయ్యాయనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.డీ పట్టా భూములపై నిర్మించిన భవనాలను బాయ్స్, గర్ల్స్ హాస్టళ్లుగా నిర్వహిస్తూ భారీ స్థాయిలో ఆదాయం పొందుతున్నారనే ఆరోపణలు గ్రామస్థుల నుంచి వస్తున్నాయి. అయితే ఈ







నిర్మాణాలకు సంబంధించి అన్ని అనుమతులు ఉన్నాయా? భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలపై స్పష్టత లేకపోవడం గమనార్హం.గతంలో అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్మాణాలు ఆగలేదని, దీంతో నోటీసులు కేవలం నామమాత్రంగానే మిగిలిపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో అధికారుల నిర్లక్ష్యమా, లేక మరేదైనా కారణమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ భూముల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలు, భూ లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే గ్రామస్తులు చేస్తున్న ఆరోపణలపై సంబంధిత అధికారులు, నిర్మాణాల యజమానులు స్పందించాల్సి ఉంది.విచారణ అనంతరం పూర్తి వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

EDITED PUBLISHED AND WONEDBY N.MAHESWARA REDDY PUBLISHED AT D.NO 1/171/2 DEVANAKONDA (M&POST) 518465, KURNOOL DIST, AP, PRINTED AT SRI LAKSHMI OFFSET PRINTERS AND PUBLICATIONS D.NO 1/171/2 DEVANAKONDA (M&POST)518465 KURNOOL DIST. CONTRACT CELL NO. 9010008143,RNI APTEL 2022/82194 Gmail :suryavelugutelugu daily@gmail.com